సంచలన తెలుగు దినపత్రిక

# హంస కలం వార్త

HAMSA KALAM VARTA

PRGI : T/TG/2026/0126/4786/1242

తెలంగాణ-ఆంధ్రప్రదేశ్, సంపుటి-01, సంచిక-93, చీఫ్ ఎడిటర్: వడ్ల మధుసూదన్ చారి, వెల: రూ.5/- గురువారం 30-04-2026







## మా ఫోన్లు హ్యాక్ చేస్తున్నారు

రిటైరైనా వదిలిపెట్టం: ఐపీఎస్ అధికారులకు హరీశ్ రావు వార్నింగ్



- బీఆర్ఎస్ నేతల ఫోన్లు, ఇంటి ముందు కెమెరాలను హ్యాక్ చేస్తున్నారన్న హరీశ్
- బెంగళూరు నుంచి ప్రైవేట్ హ్యాకర్లను రప్పించారని ఆరోపణ
- రాబోయేది తమ ప్రభుత్వమేనని వార్నింగ్

బీఆర్ఎస్ అగ్ర నాయకులతో పాటు ఎమ్మెల్యేల ఫోన్లను, వారి ఇళ్ల ముందున్న సీసీ కెమెరాలను ప్రైవేట్ హ్యాకర్ల ద్వారా కొందరు ఐపీఎస్ అధికారులు హ్యాక్ చేస్తున్నారని - మిగతా 2 లో

## దయచేసి వ్యక్తిగతంగా చొరవ తీసుకోండి

రేవంత్ రెడ్డికి కిషన్ రెడ్డి బహిరంగ లేఖ



- చర్లపల్లి రైల్వే టెర్మినల్, సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ల మౌలిక సదుపాయాలపై లేఖ
- గతంలోను ముఖ్యమంత్రికి లేఖ రాశానన్న కిషన్ రెడ్డి
- అయినప్పటికీ ఎలాంటి పురోగతి కనిపించడం లేదన్న కేంద్రమంత్రి

చర్లపల్లి నూతన రైల్వే టెర్మినల్, సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ మౌలిక సదుపాయాలకు సంబంధించి కేంద్రమంత్రి - మిగతా 2 లో

# రైతులకు గుడ్‌న్యూస్


## ఫ్యూచర్ సిటీ భూములపై రేవంత్ కీలక హామీ

- వేసవిలో చెమటలు ఎందుకు ఎక్కువగా వస్తాయి?
- ఈ ప్రాజెక్టు కేవలం ఇటుకలు, సిమెంట్ కట్టడం మాత్రమే
- రాజకీయ పరిణామాల గురించి ప్రస్తావిస్తూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రతిపక్ష
- ఫామ్‌హౌజ్‌కే పరిమితమైన నేతలు ఒకవైపు, ప్రజల మధ్య తిరుగుతూ విషం



2లో

తెలంగాణ రాష్ట్ర రాజధాని మకుటంలో మరో మణిహారంగా నిలవనున్న 'భారత్ ఫ్యూచర్ సిటీ' నిర్మాణ ప్రక్రియలో ఒక చారిత్రాత్మక ఘట్టం ఆవిష్కృతమైంది. మంగళవారం రంగారెడ్డి జిల్లా మీర్‌ఖాన్‌పేటలో ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనరేట్ కార్యాలయ భవన నిర్మాణానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అత్యంత వైభవంగా భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ, రాబోయే తరాల కోసం నిర్మిస్తున్న ఈ మహానగర అభివృద్ధిలో స్థానిక రైతులు భాగస్వాములు కావాలని ఆకాంక్షించారు. ఈ ప్రాజెక్టు కేవలం ఇటుకలు, సిమెంట్ కట్టడం మాత్రమే కాదని, తెలంగాణ భవిష్యత్తును మార్చే శక్తి అని ఆయన అభివర్ణించారు. ఫ్యూచర్ సిటీ నిర్మాణానికి భూములు ఇస్తున్న రైతుల సంక్షేమం పట్ల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అత్యంత సానుకూలంగా స్పందించారు. ప్రాజెక్టు కోసం భూములిచ్చే రైతులను ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటుందని, వారు గర్వంగా, ఆనందంగా పరిహారం తీసుకునేలా చర్యలు చేపడతామని భరోసా ఇచ్చారు. భూసేకరణ ప్రక్రియలో



## ఇరాన్ పతనం అంచున ఉంది

- వాళ్లే మాకు చెప్పారు: ట్రంప్ ఆసక్తికర వ్యాఖ్య
- హర్మూజ్ దిగ్బంధనాన్ని ముగించాలని ఇరాన్ కోరిందన్న ట్రంప్
- ఇరాన్ తమ నాయకత్వాన్ని చక్కదిద్దుకునే పనిలో ఉందని వ్యాఖ్య
- అంతర్గత విభేదాలను వారు పరిష్కరించుకోవాలని సూచన

ఇరాన్ పతనం అంచున ఉందని, ఈ విషయాన్ని స్వయంగా ఆ దేశ ప్రతినిధులే తమకు చెప్పారని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ - మిగతా 2 లో

## ఆపరేషన్ సిందూర్‌లో పాక్‌కు చుక్కలు చూపించింది ఇదే

భారత్‌కు మరో ఎస్-400..

- మేలో భారత్‌కు చేరుకోనున్న మరో ఎస్-400
- ఆపరేషన్ సిందూర్‌లో పాక్‌కు చెమటలు పట్టించిన డిఫెన్స్ సిస్టమ్
- వీటి రాకతో పాక్ సరిహద్దులో పటిష్ఠ భద్రత
- స్వదేశీ పరిజ్ఞానంతోనూ సిద్ధమవుతున్న క్షిపణి వ్యవస్థలు



భారత వైమానిక దళం (ఐఏఎఫ్) పాకిస్థాన్ సరిహద్దుల్లో అత్యంత పటిష్ఠమైన రక్షణ వ్యవస్థను నిర్మిస్తోంది. రష్యా నుంచి మే నెలలో మరో ఎస్-400 గగనతల రక్షణ వ్యవస్థ భారత్‌కు చేరుకోనుంది. దీన్ని రాజస్థాన్, పంజాబ్ సెక్టార్లలో మోహరించనున్నారు. ఈ ప్రాంతాలకు డ్రోన్లు, క్షిపణుల ముప్పు ఎక్కువగా ఉంటుంది. ఈ కొత్త ఎస్-400 స్క్వాడ్రన్ ఆ ముప్పును అడ్డుకుని సరిహద్దుల్లో ఎటువంటి లోపాలు లేకుండా చేస్తుంది. - మిగతా 2 లో

## ఆ వాహనాలకు భవిష్యత్తు లేదు: కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ



- శిలాజ ఇంధన ఆధారిత రవాణా నుంచి బయటకు రావాలన్న గడ్కరీ
- సీఎన్జీ, ఎలక్ట్రిక్ తదితర వాహనాల వైపు మళ్లాలని సూచన
- ప్రజలు చౌక వాహనం కంటే సురక్షిత వాహనానికి ప్రాధాన్యత ఇస్తున్నారన్న గడ్కరీ

డీజిల్, పెట్రోల్ వాహనాలకు భవిష్యత్తు లేదని, శిలాజ ఇంధన ఆధారిత రవాణా నుంచి త్వరగా బయటపడాలని కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ అన్నారు. మంగళవారం జరిగిన - మిగతా 2 లో

## మహిళలకు రిజర్వేషన్ కల్పించేందుకు

# శాయశక్తులా ప్రయత్నిస్తా


- ప్రతిపక్షాల నీచ రాజకీయాల వల్లే అమలు ఆగిపోయిందన్న మోదీ
- రెండు అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్ రైళ్లను ప్రారంభించిన ప్రధాని మోదీ- వారణాసి
- పుణె, అయోధ్య-ముంబయి మార్గాల్లో అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్ రైళ్లు



2లో

మహిళా రిజర్వేషన్ల బిల్లుపై కీలక వ్యాఖ్యలు చేశారు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ. మహిళలకు రిజర్వేషన్ కల్పించే హక్కు అమలు చేసేందుకు తాను సర్వశక్తులూ ఒడ్డుతానని ఆయన మహిళలకు హామీ ఇచ్చారు. ఎన్ని ఆటంకాలు వచ్చినా మహిళా రిజర్వేషన్ అమలు చేయడానికి కృషి చేస్తూనే ఉంటామన్నారు.

## ఉగ్రవాదంతో పలు సమస్యలు ఎదుర్కొంటున్నామన్న రాజ్‌నాథ్ సింగ్



- ఉగ్రవాదులకు సాయపడుతూ, ఆశ్రయం కల్పించేవారిపై చర్యలు తీసుకోవాలి
- ఉగ్రవాదులకు ఆశ్రయం కల్పించే దేశాలు తగిన పరిణామాలను ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరిక
- పహల్గామ్ ఉగ్రదాడి యావత్ మానవాళిని కుదిపేసిందని వ్యాఖ్య

ఉగ్రవాదులకు సాయపడుతూ, ఆశ్రయం కల్పించేవారిపై చర్యలు తీసుకోవడంలో షాంఘై సహకార సంస్థ (ఎస్సీవో) వెనుకాడకూడదని రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ - మిగతా 2 లో

## ఒకసారి చేతులు కలిపితే పూర్తి బాధ్యత మాదే



- దేశ డిజిటల్ ప్రయాణంలో ఇది కొత్త అధ్యాయం అన్న మంత్రి లోకేష్
- 15 బిలియన్ డాలర్ల పెట్టుబడితో ఏఐ హబ్.. 2 లక్షల ఉద్యోగాల అంచనా
- 2047 నాటికి విశాఖను ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దుతాం
- పదేళ్లలోనే విశాఖలో హైదరాబాద్ స్థాయి అభివృద్ధి సాధిస్తామని ధీమా

విశాఖపట్నం కేంద్రంగా భారతదేశ డిజిటల్ ప్రగతిలో ఒక సరికొత్త అధ్యాయానికి శ్రీకారం చుట్టామని, ఇది - మిగతా 2 లో

## ఎక్కడా లేని ఇంధన కొరత ఏపీలోనే ఎందుకొచ్చింది?



- ఇంధన సంక్షోభంపై కూటమి ప్రభుత్వాన్ని నిలదీసిన వైఎస్ షర్మిల
- రూ.500 డీజిల్ కోసం ఆక్వా రైతు పడిన ఆవేదనను ప్రస్తావించిన వైనం
- ఇది రైతును రక్షించే ప్రభుత్వమా, భక్షించే ప్రభుత్వమా అని ప్రశ్న
- మోదీకి తొత్తుగా ఉంటూ చంద్రబాబు బీజేపీ భజన చేస్తున్నారని విమర్శ
- వదంతులు నమ్మొద్దని చెప్పడం కాదు.. కళ్లు తెరవాలని చంద్రబాబుకు హితవు

రాష్ట్రంలో తీవ్ర ఇంధన సంక్షోభం ఏర్పడిందంటూ ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల కూటమి ప్రభుత్వంపై - మిగతా 2 లో

# విశాఖ ఇకపై 'ఏఐ పట్నం'

- చంద్రబాబుకు కేంద్రం హ్యాట్సాఫ్: అశ్వినీ వైష్ణవ్ ప్రసంగంలోని హైలైట్స్
- విశాఖపట్నంలో 'గూగుల్ ఏఐ డేటా హబ్'కు శంకుస్థాపన
- డేటా సెంటర్ ను ప్రధాని త్వరలోనే ప్రారంభిస్తారన్న వైష్ణవ్
- జూన్ 1న రైల్వే జోన్ ను అధికారికంగా ప్రారంభిస్తామని వెల్లడి



2లో

విశాఖపట్నంలో అత్యంత ప్రతిష్ఠాత్మకమైన 'గూగుల్ ఏఐ డేటా హబ్'కు శంకుస్థాపన జరిగింది. ఈ డేటా హబ్ తో టెక్ రంగంలో ఏపీ రూపురేఖలు మారిపోనున్నాయి. శంకుస్థాపన కార్యక్రమం ఆంధ్రప్రదేశ్ ఐటీ చరిత్రలో ఒక సువర్ణ అధ్యాయంగా నిలిచిపోనుంది. ఈ సందర్భంగా కేంద్ర ఐటీ శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ చేసిన ప్రసంగం రాష్ట్ర భవిష్యత్తుపై కేంద్ర ప్రభుత్వానికి ఉన్న నమ్మకాన్ని చాటిచెప్పింది. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు విజన్, యువనేత లోకేశ్ కార్యదక్షత కలగలిసి విశాఖను ప్రపంచ ఐటీ పటంలో అగ్రస్థానంలో నిలపబోతున్నాయని కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ ప్రశంసించారు. విశాఖలో గూగుల్ ఏఐ డేటా హబ్ శంకుస్థాపన వేదికగా ఆయన పలు

హంస కలం వార్త
HAMSA KALAM VARTA
గురువారం 30-04-2026

# మా ఫోన్లు హ్యాక్ చేస్తున్నారు

మొదటిపేజీ తరువాయి – మాజీ మంత్రి హరీశ్ రావు సంచలన ఆరోపణలు చేశారు. కొందరు ఐపీఎస్ అధికారులు బెంగళూరు నుంచి ప్రైవేట్ హ్యాకర్లను రప్పించి తమ వ్యక్తిగత సంభాషణలు, సీసీ కెమెరాలను పర్యవేక్షిస్తున్నారని మండిపడ్డారు. చట్టవిరుద్ధంగా వ్యవహరిస్తున్న అధికారులు రిటైర్ అయినా వదిలిపెట్టమని, రాబోయేది తమ ప్రభుత్వమేనని హెచ్చరించారు. బాధ్యులైన వారు సొంత ఖర్చులతో కోర్టుల చుట్టూ తిరగాల్సి వస్తుందని హెచ్చరికలు జారీ చేశారు. సోషల్ మీడియా కన్వీనర్ మన్నె క్రిశాంక్‌తో పాటు ఇతర నాయకులపై కాంగ్రెస్ ప్రభుత్వం అక్రమ కేసులు పెడుతూ వేధిస్తోందని ధ్వజమెత్తారు. బెయిల్ వచ్చే సమయంలో పీటీ వారెంట్లు తెచ్చి మరీ జైల్లో ఉంచుతున్నారని ఆరోపించారు. రైతు డిక్లరేషన్ పేరిట కాంగ్రెస్ మోసం చేసిందని, ధాన్యానికి ఇవ్వాల్సిన బోనస్‌ను ఎగ్గొట్టి రైతులను ఇబ్బందులకు గురిచేస్తోందని విమర్శించారు.

# ఇరాన్ పతనం అంచున ఉంది

మొదటిపేజీ తరువాయి – తెలిపారు. వీలైనంత త్వరగా హర్మూజ్ జలసంధిని కూడా తెరవాలని వారు కోరుకుంటున్నారని పేర్కొన్నారు. హర్మూజ్ దిగ్బంధనాన్ని ముగించాలని వారు తమను కోరారని 'ట్రూత్' సోషల్ మీడియా వేదికగా ఆయన పోస్టు పెట్టారు. ఇరాన్ తమ నాయకత్వాన్ని చక్కదిద్దుకునే పనిలో ఉందని ఆసక్తికర వ్యాఖ్య చేశారు. సుదీర్ఘ యుద్ధం కొనసాగుతున్న ప్రస్తుత పరిస్థితుల్లో, తమ దేశ ప్రతినిధులతో చర్చల విషయంలో ఇరాన్ ప్రభుత్వంలో ఉన్న అంతర్గత విభేదాలను వాళ్లు పరిష్కరించుకోవాలని పేర్కొన్నారు. అయితే ఇరాన్ నుంచి ఎవరి ద్వారా తనకు ఈ సమాచారం అందిందనే విషయాన్ని ఆయన వెల్లడించలేదు. అలాగే ఈ సంభాషణ నేరుగా జరిగిందా లేక మధ్యవర్తి ద్వారా తెలిసిందా? రిపబ్లికన్ ప్రభుత్వంలో ఎవరికి ఈ సమాచారం అందింది? అనే ప్రశ్నలపై కూడా వైట్ హౌస్ స్పందించలేదు.

## ఆ వాహనాలకు భవిష్యత్తు లేదు: కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ

మొదటిపేజీ తరువాయి – బస్ వరల్డ్ ఇండియా 2026 కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, మన దేశంలో ప్రజారవాణా వ్యవస్థలో శిలాజ ఇంధనాలకు భవిష్యత్తు లేదని అన్నారు. హైడ్రోజన్, ఇథనాల్, సీఎన్జీ, ఎల్ఎన్జీ, ఎలక్ట్రిక్ వాహనాల వైపు మారాలని సూచించారు. భౌగోళిక రాజకీయ అస్థిరతల కారణంగా చమురు సరఫరా గొలుసులో ఆందోళనలు నెలకొన్న ప్రస్తుత తరుణంలో, ప్రత్యామ్నాయం చూడాలనే చర్చ సాగుతోంది. ఇలాంటి తరుణంలో గడ్కరీ కీలక వ్యాఖ్యలు చేశారు. బయోఫ్యూయల్ వంటి స్వదేశీ, స్వచ్ఛమైన ఇంధనాల వైపు మళ్లడం తప్పనిసరి అన్నారు. రవాణా రంగం తక్కువ ఖర్చుతో కూడిన, కాలుష్యరహిత, స్వదేశీ పరిష్కారాలపై దృష్టి సారించాలని సూచించారు. ఖర్చు తగ్గించుకోవడానికి భద్రత, నాణ్యత విషయాల్లో రాజీపడకూడదని బస్సుల తయారీదారులను ఉద్దేశించి సూచించారు. ప్రజలు ఇప్పుడు చౌక వాహనం కంటే సురక్షితమైన, మెరుగైన వాహనానికే ప్రాధాన్యత ఇస్తున్నారని తెలిపారు. దేశంలో బస్సుల తయారీ అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా ఉండాలని అన్నారు. ప్రపంచవ్యాప్తంగా ప్రతి వెయ్యి మంది కోసం ఎనిమిది బస్సులు ఉంటే, మన దేశంలో కేవలం రెండు ఉన్నాయని అన్నారు. రాబోయే మూడేళ్లలో ఎలక్ట్రిక్ బస్సుల అవసరం 1.5 లక్షల యూనిట్లకు చేరుకుంటుందని అంచనా వేశారు.

# ఉగ్రవాదంతో పలు సమస్యలు ఎదుర్కొంటున్నామన్న రాజ్‌నాథ్ సింగ్

మొదటిపేజీ తరువాయి – సింగ్ అన్నారు. ఉగ్రవాదులకు ఆశ్రయం కల్పించే దేశాలు అందుకు తగిన పరిణామాలను ఎదుర్కోక తప్పదని హెచ్చరించారు. కిర్గిస్థాన్‌లో జరిగిన షాంఘై సహకార సంస్థ రక్షణ మంత్రుల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, గత సంవత్సరం జరిగిన పహల్గామ్ ఉగ్రదాడి యావత్ మానవాళిని కుదిపేసిందని అన్నారు. ఆ తర్వాత భారత్ ఆపరేషన్ సిందూర్ చేపట్టి, ఉగ్రవాదులు ఎక్కడున్నా తప్పించుకోలేరని నిరూపించిందని అన్నారు. ఉగ్రవాదం ప్రపంచానికి ప్రధాన సమస్యగా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు. తీవ్రవాదం, ఉగ్రవాదంతో పలు సమస్యలు ఎదుర్కొంటున్నట్లు చెప్పారు. ఉగ్రవాద బెదిరింపులకు వ్యతిరేకంగా చర్యలు తీసుకోవడానికి భారత్ సిద్ధంగా ఉందని అన్నారు. ప్రభుత్వ మద్దతుతో జరిగి సీమాంతర ఉగ్రవాదాన్ని ఏమాత్రం ఉపేక్షించకూడదని ఈ సందర్భంగా కోరారు. ఉగ్రవాదాన్ని ఎదుర్కోవడంలో ద్వంద్వ ప్రమాణాలు ఉండకూడదని వ్యాఖ్యానించారు. ఉగ్రవాదులకు సాయపడుతూ, ఆశ్రయం కల్పించేవారిపై చర్యలు తీసుకోవడంలో షాంఘై సహకార సంస్థ ముందుండాలని కోరారు. గత కొన్నేళ్లుగా జరుగుతున్న వరుస ఘర్షణల కారణంగా ఎంతోమంది ప్రజలు ప్రాణాలు కోల్పోయారని ఇటీవలి యుద్ధాలను ఉద్దేశించి అన్నారు.

## ఎక్కడా లేని ఇంధన కొరత ఏపీలోనే ఎందుకొచ్చింది?

మొదటిపేజీ తరువాయి – తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. రూ.500 డీజిల్ కోసం ఓ ఆక్వా రైతు పడిన ఆవేదనను ప్రస్తావిస్తూ, ఇది రైతులను రక్షించే ప్రభుత్వమా లేక భక్షించే ప్రభుత్వమా అని ఘాటుగా ప్రశ్నించారు. చంద్రబాబు పాలనలో ఆక్వా రైతుల పరిస్థితి దయనీయంగా మారిందని, ఇది వారి పాలిట శాపంగా పరిణమించిందని ఆమె విమర్శించారు. ఈ మేరకు ఆమె ఓ రైతు ఆక్రోశిస్తున్న ఓ వీడియో పంచుకున్నారు. "కూటమి పాపం.. ఆక్వా రైతన్న పాలిట శాపం. రాష్ట్రంలో ఇంధన సంక్షోభం రొయ్య రైతులకు అంతులేని కష్టం. కంటికి రెప్పలా చూసుకొనే రొయ్య పిల్లలను బ్రతికించేందుకు ఓ పెట్రోల్ బంకు దగ్గర రైతన్న పడిన ఆవేదన వర్ణనాతీతం. రూ. 500 డీజిల్ కోసం ఆ రైతు రోదించిన తీరు చూసి కూటమి ప్రభుత్వం సిగ్గుపడాలి. "అన్నా నాకు ఫ్యాన్ సీట్లు (ఏరేటర్) తిరగాలన్నా .. అప్పుచేసి రొయ్య పిల్ల వేశాను.. ఫ్యాన్ సీట్లు తిరగకపోతే నా రొయ్య పిల్ల చచ్చిపోద్ది అన్న" రైతన్న ఆవేదన వింటుంటే ఈ రాష్ట్రంలో ప్రభుత్వం ఉన్నట్లా లేనట్లా చంద్రబాబు గారి ఛాతిలో ఉన్నది గుండెనా బండనా ఇది రైతన్నను రక్షించే ప్రభుత్వమా? భక్షించే ప్రభుత్వమా ఇదేనా చంద్రబాబు గారి విజినరీ దీన్నే అంటారా అద్భుతమైన గుడ్ గవర్నెన్స్ రైతులతో కాళ్లు పట్టించుకున్న పాపం ఈ కూటమి ప్రభుత్వానికి తగలకపోదు. ఎక్కడా లేని ఇంధన సంక్షోభం ఏపీలోనే ఎందుకొచ్చింది ఎన్డీయే పాలిత రాష్ట్రంలో ఇంధనం కోసం ప్రజల పడిగాపులా పెట్రోల్ బంకుల దగ్గర మల్లయుద్ధాలా? రేషన్ విధానంలో పెట్రోల్, డీజిల్ పోయడమా? సరిపడేంత ఇంధనం ఉంటే దాదాపు 3 వేల బంకుల్లో నో స్టాక్ బోర్డులు ఇవ్వాల్టికి ఎందుకున్నాయి ఇదేనా రాష్ట్ర ప్రజలపై కేంద్రానికున్న చిత్తశుద్ధి ఇందుకేనా పడి పడి మోదీజీకి మద్దతు ఇచ్చేది బంకుల దగ్గర జనాలు అవస్థలు పడుతుంటే, ప్రత్యక్షంగా అన్నీ రంగాలపై ఇంధన సంక్షోభం తీవ్ర పరిణామాలు చూపిస్తుంటే, ఇంకా బీజేపీ భజన చేయడానికి, మోదీగారి తొత్తుగా ఉండటానికి చంద్రబాబు గారు సిగ్గుపడాలి. రాష్ట్రంపై బీజేపీకి పట్టింపు లేదనడానికి ఇంధన సంక్షోభం ఒక నిదర్శనం. వదంతులు నమ్మొద్దని చెప్పే బదులు... ఇప్పటికైనా కళ్లు తెరవండి చంద్రబాబు గారు" అంటూ షర్మిల తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు.

# రైతులకు గుడ్‌న్యూస్..

మొదటిపేజీ తరువాయి – రైతుల మనసుల్లో ఎలాంటి అభద్రతా భావం తలెత్తకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. అభివృద్ధి కోసం తమ సొంత భూములను త్యాగం చేసే రైతులను అధికారులు గౌరవించాలని, ముఖ్యంగా పేద రైతుల విషయంలో మానవత్వంతో వ్యవహరించాలని ఆయన స్పష్టం చేశారు. రైతులు మరోచోట మెరుగైన భూమిని కొనుగోలు చేసేలా పారదర్శకమైన ఆర్థిక సహాయం అందజేస్తామని హామీ ఇచ్చారు. ఈ బృహత్తర ప్రాజెక్టు విజయవంతం కావాలంటే కేవలం ప్రభుత్వం మాత్రమే కాకుండా, స్థానిక ప్రజాప్రతినిధులు కూడా క్రియాశీలక పాత్ర పోషించాలని సీఎం పిలుపునిచ్చారు. సర్పంచ్‌లు, కార్పొరేటర్లు క్షేత్రస్థాయిలో ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధులుగా ఉండాలని ఆయన కోరారు. ఫ్యూచర్ సిటీ పరిధిలోకి వచ్చే గ్రామాల సర్పంచ్‌లను గౌరవించాలని, ప్రభుత్వ అధికారిక కార్యక్రమాల్లో వారికి ప్రోటోకాల్ ప్రకారం ఆహ్వానాలు పంపాలని అధికారులకు సూచించారు. తమ గ్రామాలను కూడా ఫ్యూచర్ సిటీలో కలపాలని స్థానికుల నుండి విజ్ఞప్తులు వస్తున్నాయని, అటువంటి వారు గ్రామసభల్లో తీర్మానం చేసి కలెక్టర్లకు పంపితే తప్పకుండా పరిశీలిస్తామని ఆయన ప్రకటించారు. రాజకీయ పరిణామాల గురించి ప్రస్తావిస్తూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రతిపక్ష బీఆర్ఎస్ నేతలపై తనదైన శైలిలో విమర్శలు గుప్పించారు. అభివృద్ధిని అడ్డుకోవాలని చూస్తున్న వారిని పురాణాల్లోని విద్రోహ శక్తులతో పోల్చారు. ఫామ్‌హౌజ్‌కే పరిమితమైన నేతలు ఒకవైపు, ప్రజల మధ్య తిరుగుతూ విషం చిమ్మే మరికొందరు నేతలు అభివృద్ధికి అడ్డం పడుతున్నారని మండిపడ్డారు. అధికారం కోల్పోయిన అసూయతో కొందరు చేస్తున్న విమర్శలను తాను పట్టించుకోనని, వారు ఎంతగా ఏడుస్తుంటే అభివృద్ధి పనులను అంత వేగంగా ముందుకు తీసుకెళ్తానని ఆయన ఎద్దేవా చేశారు.

### వేసవిలో చెమటలు ఎందుకు ఎక్కువగా వస్తాయి?

హైదరాబాద్ అభివృద్ధి ఏ ఒక్క వ్యక్తితోనో లేదా పార్టీతోనో ఆగిపోయేది కాదని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. పాత నగరం, కొత్త నగరం, సైబరాబాద్ తర్వాత ఇప్పుడు 'నాలుగో నగరం'గా భారత్ ఫ్యూచర్ సిటీని ప్రపంచ స్థాయి ప్రమాణాలతో తీర్చిదిద్దుతున్నామని చెప్పారు. గ్లోబల్ సిటీలతో పోటీ పడేలా అత్యాధునిక మౌలిక సదుపాయాలు ఇక్కడ అందుబాటులోకి వస్తాయని ధీమా వ్యక్తం చేశారు. కేవలం నివాస ప్రాంతంగానే కాకుండా, పరిశ్రమలు, సాంకేతిక రంగాలకు ఈ నగరం చిరునామాగా మారుతుందని ఆయన వివరించారు. పనుల వేగంపై అధికారులకు గడువు విధిస్తూ, వచ్చే ఏడాది జూన్ 2న తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం నాటికి ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనరేట్ భవనాన్ని పూర్తి చేయాలని ముఖ్యమంత్రి లక్ష్యాన్ని నిర్దేశించారు. కమిషనరేట్ ఏర్పాటుతో ఈ ప్రాంతంలో శాంతిభద్రతలు మెరుగుపడటమే కాకుండా, పారిశ్రామిక వేత్తలకు, పెట్టుబడిదారులకు భద్రతపై గట్టి భరోసా లభిస్తుందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రులు, ఉన్నతాధికారులు మరియు భారీ సంఖ్యలో తరలివచ్చిన స్థానిక ప్రజలు పాల్గొని ఫ్యూచర్ సిటీ ఆవిర్భావానికి మద్దతు తెలిపారు.

# ఒకసారి చేతులు కలిపితే పూర్తి బాధ్యత మాదే

మొదటిపేజీ తరువాయి – కేవలం గూగుల్ ఏఐ డేటా సెంటర్ ప్రారంభం మాత్రమే కాదని, ఆంధ్రప్రదేశ్ భవిష్యత్తుకు కీలకమైన మలుపు అని రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ అన్నారు. గూగుల్ ఆధ్వర్యంలో విశాఖ నోవాటెల్ హోటల్‌లో మంగళవారం జరిగిన 'భారత్ ఏఐ శక్తి కాంక్లేవ్'లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా, విశాఖ అభివృద్ధిపై ప్రజా ప్రభుత్వ దార్శనికతను, లక్ష్యాలను ఆయన స్పష్టంగా వివరించారు. పెట్టుబడుల విషయంలో ఎంవోయూలపై కాకుండా, షేక్ హ్యాండ్‌లపై నమ్మకం ఉంచుతామని, ఒకసారి చేతులు కలిపితే ఆ ప్రాజెక్టును తమదిగా భావించి పూర్తి బాధ్యత తీసుకుంటామని హామీ ఇచ్చారు. రాష్ట్రంలో 20 లక్షల ఉద్యోగాల కల్పనే ధ్యేయంగా పనిచేస్తున్నామని, పారిశ్రామికవేత్తలు పెద్దఎత్తున ఏపీ, విశాఖలో పెట్టుబడులు పెట్టాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో గూగుల్ క్లౌడ్ గ్లోబల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ వైస్ ప్రెసిడెంట్ బికాష్ కోలేతో పాటు 49 కంపెనీల ప్రతినిధులు, పలువురు పారిశ్రామికవేత్తలు పాల్గొన్నారు. "దశాబ్దాలుగా దేశ ఖనిజ సంపదను ప్రపంచానికి అందించిన విశాఖ నగరం.. ఉక్కు పునాదులపై నిర్మితమైంది. కానీ నేడు, ఈ ఉక్కు నగర పునాదులను కృత్రిమ మేధ (ఏఐ) విప్లవంపై నిర్మించబోతున్నాం. మన దేశ భవిష్యత్తును వైజాగ్ నిర్మించబోతోందని నేను బలంగా విశ్వసిస్తున్నాను" అని లోకేష్ పేర్కొన్నారు. ప్రపంచం భారీ పరిశ్రమల నుంచి డిజిటల్ మౌలిక సదుపాయాల వైపు, తయారీ నుంచి మెషిన్ ఇంటెలిజెన్స్ వైపు వేగంగా మారుతోందని, ఈ మార్పులో విశాఖ కీలక పాత్ర పోషించనుందని తెలిపారు.

**15 బిలియన్ డాలర్ల పెట్టుబడి.. 2 లక్షల ఉద్యోగాలు**

గూగుల్ ఏఐ హబ్ ఏర్పాటు చరిత్రాత్మకమని మంత్రి అభివర్ణించారు. దేశంలోనే అతిపెద్ద విదేశీ ప్రత్యక్ష పెట్టుబడి అయిన 15 బిలియన్ డాలర్లతో పాటు, ఒక గిగా వాట్ సామర్థ్యం గల డేటా సెంటర్ ఎకోసిస్టమ్ ఇక్కడ రూపుదిద్దుకోనుందని తెలిపారు. తొలిసారిగా విశాఖలో కేబుల్ ల్యాండింగ్ స్టేషన్లు ఏర్పాటు కానున్నాయని, కనెక్టివిటీ విషయంలో ఇతర రాష్ట్రాలతో దీటుగా పోటీ పడతామని చెప్పారు. "ఒకప్పుడు ఓడరేవులు ఈ నగరాన్ని ప్రపంచంతో భౌతికంగా కలిపితే, ఇప్పుడు ఈ కేబుల్ ల్యాండింగ్ స్టేషన్లు డిజిటల్‌గా అనుసంధానిస్తాయి. ఈ పెట్టుబడి వల్ల ప్రత్యక్షంగా, పరోక్షంగా సుమారు 2 లక్షల ఉద్యోగాలు వస్తాయి. ఇది కేవలం ఒక ప్రాజెక్ట్ కాదు, ఆర్థికాభివృద్ధికి ఒక మల్టిప్లయర్," అని లోకేష్ వివరించారు.

**2047 నాటికి ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా విశాఖ**

2047 నాటికి విశాఖ ఎకనమిక్ రీజియన్‌ను ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దడమే తమ ప్రభుత్వ లక్ష్యమని లోకేష్ స్పష్టం చేశారు. ఇటీవల ఆర్సెలార్ మిట్టల్‌తో కలిసి గ్రీన్ స్టీల్ సిటీకి శంకుస్థాపన చేశామని, అదేవిధంగా ఏఐ, డేటా, ఫార్మా, మెడికల్ డివైసెస్ రంగాల్లో భారీ అభివృద్ధి జరగనుందని తెలిపారు. హైదరాబాద్ అభివృద్ధిని ఉదాహరణగా చూపుతూ, "ఒకప్పుడు సైబర్ టవర్స్ నిర్మాణానికి చంద్రబాబు గారు సంకల్పించినప్పుడు అందరూ ఎగతాళి చేశారు. కానీ, స్పష్టమైన విజన్‌తో అది సాధ్యమైంది. హైదరాబాద్‌లో 30 ఏళ్లలో సాధించిన అభివృద్ధిని, విశాఖలో రాబోయే 10 ఏళ్లలోనే సాధించి చూపిస్తాం," అని ధీమా వ్యక్తం చేశారు.

**అదే మమ్మల్ని ముందుకు నడిపిస్తోంది**

ఆంధ్రప్రదేశ్ నూతన రాష్ట్రమని, అందుకే తమలో అభివృద్ధి పట్ల కసి, పట్టుదల ఎక్కువగా ఉన్నాయని మంత్రి అన్నారు. "చరిత్రలో నాలుగుసార్లు రాష్ట్రాన్ని పునర్నిర్మించుకోవాల్సిన అవసరం మాకు పడింది. మొదట మద్రాసులో, తర్వాత కర్నూలు రాజధానిగా, ఆ తర్వాత హైదరాబాద్‌ను అభివృద్ధి చేసుకుని విడిపోయాం. ఈ అనుభవమే మమ్మల్ని ముందుకు నడిపిస్తోంది. మమ్మల్ని ఒక స్టార్టప్‌లా చూడండి" అని పారిశ్రామికవేత్తలను కోరారు. మా కేబినెట్‌లో 25 మంది మంత్రుల్లో 17 మంది, శాసనసభ్యుల్లో సగం మంది కొత్తవారేనని, అందరం ఉత్సాహంతో పనిచేస్తున్నామని చెప్పారు.

# ఆపరేషన్ సిందూర్‌లో పాక్‌కు చుక్కలు చూపించింది ఇదే..

మొదటిపేజీ తరువాయి – **600 కిలోమీటర్ల నిఘా.. 300 లక్ష్యాలు**

ఎస్–400 వ్యవస్థలోని శక్తిమంతమైన రాడార్ (91ఎన్6ఈ) ఒకేసారి 300 లక్ష్యాలను గుర్తించగలదు. ఇది 600 కిలోమీటర్ల దూరంలో ఉన్న శత్రు కదలికలను పసిగట్టగలదు. దీనివల్ల సరిహద్దుకు అవతల ఉన్న ఉగ్రవాద లాంచ్ ప్యాడ్లను కూడా భారత్ తన భూభాగం నుంచే గమనించవచ్చు. శత్రువులు క్షిపణిని ప్రయోగించే లోపే ఎస్–400 దాన్ని లాక్ చేసి, భారత్ అప్రమత్తం అయ్యేలా చేస్తుంది.

**బహుళ అంచెల రక్షణ కవచం**

భారత్ కేవలం ఒక్క ఎస్–400 మీదనే ఆధారపడకుండా మూడు రకాల రక్షణ వ్యవస్థలను ఏర్పాటు చేస్తోంది. సుదూర లక్ష్యాల కోసం (400 కి.మీ) ఎస్–400 ట్రయంఫ్ సిస్టమ్‌ను సిద్ధం చేసింది. మధ్య శ్రేణి లక్ష్యాల కోసం (150–350 కి.మీ) స్వదేశీ పరిజ్ఞానంతో తయారవుతున్న 'ప్రాజెక్ట్ కుశ'ను వాడుకోనుంది. దగ్గరి లక్ష్యాల కోసం ఇజ్రాయెల్ సహకారంతో రూపొందించిన ఎంఆర్–ఎస్ఏఎం, భారత్ తయారు చేసిన సమర్ (ఎస్ఏఎంఏఆర్), ఆకాశ్ క్షిపణి వ్యవస్థలు ఉపయోగపడున్నాయి.

**'ఆపరేషన్ సిందూర్' అనుభవం**

మే 2025లో జరిగిన ఆపరేషన్ సిందూర్ సమయంలో ఎస్–400 యుద్ధ సామర్థ్యం ఏంటో యావత్ ప్రపంచం చూసింది. ఆ సమయంలో పాకిస్థాన్ ప్రయోగించిన క్షిపణులను ఇది విజయవంతంగా అడ్డుకుంది. ఆ అనుభవంతో భారత వైమానిక దళం ఈ క్షిపణి రక్షణ వ్యవస్థ సాఫ్ట్‌వేర్‌ను డ్రోన్ దాడులను కూడా తట్టుకునేలా మరింత ఆధునికీకరిస్తోంది.

**పటిష్ఠమైన రక్షణ వ్యవస్థ**

అంతర్జాతీయ ఆంక్షలు ఉన్నప్పటికీ రష్యా–భారత్ రక్షణ ఒప్పందం ప్రకారం ఈ సరఫరా నిరంతరాయంగా కొనసాగుతోంది. 2026 నాటికి ఐదు స్క్వాడ్రన్‌లు పూర్తిస్థాయిలో అందుబాటులోకి వస్తే హిమాలయాల నుంచి కచ్ వరకు భారత్ చుట్టూ ఒక బలమైన రక్షణ కవచం ఏర్పడుతుంది.

# దయచేసి వ్యక్తిగతంగా చొరవ తీసుకోండి

మొదటిపేజీ తరువాయి – కిషన్ రెడ్డి తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి బహిరంగ లేఖ రాశారు. ఈ పనుల నిమిత్తం గతంలో పలుమార్లు లేఖలు రాసినా అధికారుల నుంచి క్షేత్రస్థాయిలో ఎలాంటి పురోగతి లేదని పేర్కొన్నారు. "దయచేసి ముఖ్యమంత్రి వ్యక్తిగతంగా చొరవ తీసుకుని ఆయా రైల్వే స్టేషన్ల అభివృద్ధి పనులను పూర్తి చేయాలి" అని విజ్ఞప్తి చేశారు. హైదరాబాద్ నగరంలో రోజురోజుకు పెరుగుతున్న జనాభా, ప్రయాణికుల రాకపోకల మూలంగా నగరంలోని మూడు ప్రధాన రైల్వే స్టేషన్లు సికింద్రాబాద్, కాచిగూడ, హైదరాబాద్ టెర్మినల్లపై అధిక భారం పడుతోందని గుర్తు చేశారు. ఈ సమస్యకు పరిష్కారంగానే చర్లపల్లి రైల్వే స్టేషన్ వద్ద రూ.430 కోట్లతో అత్యాధునిక సౌకర్యాలతో కొత్త టెర్మినల్‌ను కేంద్రం అభివృద్ధి చేసిందని అన్నారు. గత సంవత్సరం ప్రధాని మోదీ ప్రారంభించిన ఈ టెర్మినల్ నుంచి పదుల సంఖ్యలో రైళ్లు సేవలు అందిస్తున్నాయని తెలిపారు. రోజురోజుకు ప్రయాణికుల సంఖ్య పెరుగుతున్నందున రైల్వే స్టేషన్‌కు వెలుపల అప్రోచ్ రోడ్లను విస్తరించాల్సి ఉందని అన్నారు. స్టేషన్‌కు ఇరువైపులా పార్కింగ్ తదితర అవసరాల కోసం కూడా భూసేకరణ చేయాల్సి ఉందని తెలిపారు. చర్లపల్లి స్టేషన్ నుంచి ఎఫ్‌సీఐ గోడౌన్‌కు 200 అడుగుల వెడల్పుతో, భరత్ నగర్, ఈసీ నగర్‌ల వైపు 100 అడుగుల చొప్పున వెడల్పుతో రోడ్లను విస్తరించాలని కోరారు. చర్లపల్లి టెర్మినల్‌కు నీటి సరఫరా కనెక్షన్‌ను ఏర్పాటు చేయడానికి రైల్వే శాఖ రూ.4 కోట్లు జమ చేసిందని, ఈ నీటి కనెక్షన్ త్వరగా పూర్తి చేయాలని సూచించారు. భవిష్యత్తు రద్దీని దృష్టిలో పెట్టుకుని సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌ను కూడా అంతర్జాతీయ ప్రమాణాలతో, అత్యాధునిక సౌకర్యాలతో పునరాభివృద్ధి చేస్తున్నామని కిషన్ రెడ్డి తెలిపారు. ఈ స్టేషన్ వద్ద ఆల్ఫా హోటల్ నుంచి రేతిఫైల్ బస్ స్టేషన్ వరకు ఉన్న రహదారిని 120 అడుగుల వెడల్పుతో విస్తరించాల్సి ఉందని అన్నారు. ఈ అభివృద్ధి పనుల కోసం రైల్వే శాఖ అధికారులు, జీహెచ్ఎంసీ అధికారులతో క్షేత్రస్థాయి పరిశీలన జరిపి నివేదించామని అన్నారు. ఈ పెండింగ్ పనులకు సంబంధించి 2022, 2023 సంవత్సరాలలో నాటి ముఖ్యమంత్రికి రెండుసార్లు లేఖలు రాశానని గుర్తు చేశారు. 2024లో మీకు కూడా లేఖ రాశానని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఉద్దేశించి కిషన్ రెడ్డి పేర్కొన్నారు. అయినా ఇప్పటి వరకు పనులు పూర్తి కాలేదని అన్నారు. తాను ఉత్తరం రాసిన తర్వాత మీరు పనులు ప్రారంభించాలని ఆదేశించినప్పటికీ ఇప్పటి వరకు ఎలాంటి ఫలితం లేదని పేర్కొన్నారు. ఇప్పటికైనా ఈ పనులను పూర్తి చేయాలని తన లేఖలో కిషన్ రెడ్డి కోరారు.


# విశాఖ ఇకపై 'ఏఐ పట్నం'

మొదటిపేజీ తరువాయి – ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. "అప్పట్లో చంద్రబాబు నిర్మించిన సైబర్ టవర్స్ నేడు ఐటీ రంగానికి వెన్నెముకగా నిలిచాయి. ఇప్పుడు అదే స్ఫూర్తితో విశాఖలో నిర్మిస్తున్న ఏఐ డేటా హబ్ ప్రపంచస్థాయి నిపుణులను ఆకర్షిస్తుంది. ఆయన నిజమైన విజనరీ లీడర్" అని కొనియాడారు. ఐటీ మంత్రి నారా లోకేశ్ శక్తిసామర్థ్యాలను వైష్ణవ్ ప్రత్యేకంగా ప్రశంసించారు. ప్రాజెక్టుపై లోకేశ్‌కు ఉన్న స్పష్టత, సమస్యలను పరిష్కరించే తీరు యువ నాయకులకు ఆదర్శమని పేర్కొన్నారు. అలాగే కేంద్ర మంత్రులు రామ్మోహన్ నాయుడు, పెమ్మసాని చంద్రశేఖర్‌లు పార్లమెంట్‌లో ఏపీ గొంతుకగా నిలుస్తున్నారని మెచ్చుకున్నారు.

**అశ్వినీ వైష్ణవ్ ప్రసంగంలోని హైలైట్స్:**

"విజనరీ లీడర్ చంద్రబాబు హైదరాబాద్ లో నిర్మించిన సైబర్ టవర్ ఐటీకి ఐకానిక్. గూగుల్ ఏఐ డేటా సెంటర్ తో విశాఖపట్నం ఇక ఏఐ పట్నంగా మారుతుంది. ప్రధాని మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు విజన్ కు సెల్యూట్ చేస్తున్నాను. విద్య, వైద్యం, ఏరోస్పేస్, లాజిస్టిక్స్, వ్యవసాయం ఇలా వేర్వేరు రంగాల్లో ఏఐ విప్లవం వస్తోంది. గూగుల్ క్లౌడ్ ఇండియా ఏఐ హబ్ ద్వారా విశేషమైన సేవలు అందుతాయి. ఎంఓయూ చేసుకున్న అతి తక్కువ సమయంలో గూగుల్ ఏఐ డేటా హబ్ శంకుస్థాపన జరుగుతోంది. ఏఐ డేటా సెంటర్ ను ప్రధాని మోదీ చేతుల మీదుగా ప్రారంభించుకునే రోజు దగ్గర్లోనే ఉంది. ఐటీ సేవల రంగంలో భారత్ లీడర్ గా ఎదిగింది. మన దేశంలోని నాయకత్వం కీలకంగా వ్యవహరించింది. గతంలో ఉత్పత్తి రంగంపై భారత్ ముందుకు వెళ్లలేకపోయింది. సెమీ కండక్టర్లు, చిప్, ల్యాప్ టాప్, మొబైల్ ఉత్పత్తుల లాంటి ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తిలో వెనుకబడ్డాం. ప్రధాని మోదీ చొరవతో మొబైల్ మాన్యుఫాక్చరింగ్ రంగంలో ఇప్పుడు ముందడుగు వేశాం. భారత్ నుంచి ఇప్పుడు మొబైల్ ఫోన్లు అత్యధికంగా ఎగుమతి అవుతున్నాయి. దేశీయంగా అవసరమైన 50 శాతం ఎలక్ట్రానిక్ పరికరాలను మన దేశంలోనే ఉత్పత్తి చేసుకుంటున్నాం. మేజర్ ఎలక్ట్రానిక్స్ డెవలప్మెంట్, డిజైన్ చేసే దేశంగా భారతదేశాన్ని గుర్తించాలి. సెమీ కండక్టర్ మిషన్ లో భాగంగా ఇప్పటికే వాణిజ్య పరమైన ఉత్పత్తిని ప్రారంభించాం. సెమీ కండక్టర్లు, ఎలక్ట్రానిక్స్ పరికరాల ఉత్పత్తిలో భారత్ ఎంతో ఎదిగింది. డేటా సెంటర్లకు అవసరమైన సర్వర్లను కూడా దేశంలోనే ఉత్పత్తి చేసేలా టెక్ కంపెనీలు కృషి చేయాలి. గూగుల్ కూడా తమ సర్వర్లను, జీపీయూ, చిప్ లను ఇక్కడే ఉత్పత్తి చేసేలా చూడాలి. భారతదేశం చేస్తున్న ఈ సూచనను గూగుల్ సీఈఓ సుందర్ పిచాయ్ కు కూడా తెలియచేయాలని విజ్ఞప్తి. తక్కువ వ్యయంతోనే నాణ్యమైన ఉత్పత్తులు తయారు చేసేందుకు వీలుంది. విశాఖ నుంచి 3 సబ్ సీ కేబుల్స్ ను వేస్తున్నందుకు గూగుల్ కు ధన్యవాదాలు. ఆస్ట్రేలియా, మిడిల్ ఈస్ట్ మీదుగా యూరోప్ కు, ఆఫ్రికా మీదుగా అమెరికాకు వెళ్లేలా ఈ సబ్ సీ కేబుల్స్ వేస్తున్నారు. డబుల్ ఇంజన్ బులెట్ ట్రైన్ సర్కార్ ద్వారా ఏపీకి రూ. 10,134 కోట్ల రైల్వే బడ్జెట్ ను కేటాయించాం. గతంలో ఉమ్మడి ఏపీకి కేవలం రూ. 886 కోట్లు మాత్రమే బడ్జెట్ ఉండేది. ప్రస్తుతం రూ.1.06 లక్షల కోట్ల రైల్వే ప్రాజెక్టులు ఏపీని కనెక్ట్ చేస్తూ నిర్మాణంలో ఉన్నాయి. దేశంలోనే తొలిసారి నవ నిర్మాణ్ ప్రాజెక్టు ద్వారా ఏపీలో 74 స్టేషన్లను ఆధునికీకరిస్తున్నాం. 832 ఫ్లైఓవర్లు, అండర్ పాస్ ల నిర్మాణం జరిగాయి. 1039 కిలోమీటర్ల మేర రైల్వే లైన్ నిర్మాణం జరుగుతోంది. 100 శాతం ఎలక్ట్రిఫికేషన్ పూర్తి చేసుకున్న రాష్ట్రం ఏపీ.16 వందే భారత్ సర్వీసులు ఏపీలో నడుస్తున్నాయి. 22 అమృత్ భారత్ సర్వీసులు కూడా ఏపీ నుంచి నడుస్తున్నాయి. రైళ్ల డిజైన్, ఉత్పత్తిలో చాలా జాగ్రత్తలు తీసుకున్నాం. ఏపీలో సౌత్ కోస్ట్ రైల్వే జోన్ లాంటి కీలకమైన విభజన హామీని కేంద్రం నెరవేర్చింది. 2026 జూన్ 1 తేదీన సౌత్ కోస్ట్ రైల్వే జోన్ ను అధికారికంగా నోటిఫై చేయబోతున్నాం. అమరావతి నుంచి హైదరాబాద్ కు బులెట్ ట్రైన్ ప్రాజెక్టు కూడా త్వరలోనే సాకారం కాబోతోంది. 70 నిమిషాల్లో అమరావతి నుంచి హైదరాబాద్ కు చేరుకునేలా ఈ ప్రాజెక్టు వస్తోంది. 112 నిమిషాల్లో అమరావతి నుంచి చెన్నైకు చేరుకునేలా బులెట్ ట్రైన్ నిర్మాణం చేస్తాం. అభివృద్ధిలోనూ, సంక్షేమంలోనూ దక్షిణాది రాష్ట్రాలకు కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం పూర్తి న్యాయం చేస్తుంది. ప్రతిపక్ష పార్టీలు మాత్రం ప్రతీ అంశాన్నీ రాజకీయం చేస్తున్నాయి. కోల్ కోతా నుంచి చెన్నై వరకూ ఉన్న తూర్పు కోస్తా రైల్వే డబుల్ లైన్లను ఫోర్ లైన్లుగా మారుస్తాం. కంటైనర్, ఫ్రైట్ ట్రైన్లతో పాటు 500 రైళ్లతో ఈ ప్రాంతాన్ని అనుసంధానిస్తాం" అని తెలిపారు.

# మహిళలకు రిజర్వేషన్ కల్పించేందుకు శాయశక్తులా ప్రయత్నిస్తా : ప్రధాని మోదీ



మొదటిపేజీ తరువాయి – పార్లమెంట్‌లో మహిళా రిజర్వేషన్ల బిల్లును ప్రవేశపెట్టడానికి తాము ఎంతగానో ప్రయత్నించామని అన్నారు. కాంగ్రెస్, ఎస్పీ వంటి ప్రతిపక్ష పార్టీల నీచ రాజకీయాల వల్లే ఆ చట్టం అమల్లోకి రాకుండా ఆగిపోయిందని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మహిళలు అభివృద్ధి చెందడం, అసెంబ్లీలు, పార్లమెంట్‌లకు రావడం ప్రతిపక్షాలకు ఇష్టం లేదని, అందువల్లే 40 ఏళ్లుగా ఈ బిల్లును అడ్డుకుంటూనే ఉన్నారని తెలిపారు. వారణాసిలో నిర్వహించిన సభలో ప్రసంగించిన ప్రధాని మోదీ, తమ తప్పులు కప్పిపుచ్చుకోవడానికి సాకులు వెతుకుతున్నారని అన్నారు. లోక్‌సభ, రాష్ట్ర శాసనసభల్లో మహిళలకు రిజర్వేషన్లు అమలు చేయడమనే మహా యజ్ఞం ప్రారంభించేందుకు సిద్ధమవుతున్నానని ప్రధాని మోదీ అన్నారు. అందుకు మాతృమూర్తుల ఆశీస్సులు తీసుకునేందుకు వారణాసి వచ్చానని ప్రధాని పేర్కొన్నారు. ఈ బిల్లును తేవడానికి చేస్తున్న ప్రయత్నాల్లో ఎలాంటి రాజకీయ దురుద్దేశం లేదని, ఇది రాజకీయ పార్టీల కోసం తెచ్చింది కాదని వ్యాఖ్యానించారు. సాధారణ కుటుంబాల మహిళలు పార్లమెంటు, అసెంబ్లీలకు రావాలని కోరుకున్నానని చెప్పారు. కానీ ప్రతిపక్షాలు మాత్రం అధికారం తమ కుటుంబాలకే పరిమితం కావాలని కోరుకుంటున్నాయని విమర్శించారు. మహిళా రిజర్వేషన్లపై తమ పోరాటం ముగిసిపోలేదని, చట్టాన్ని అమలు చేసే వరకు పోరాడుతూనే ఉంటామని స్పష్టం చేశారు. "ఈ మహా యజ్ఞం ప్రారంభించేందుకు సోదరీమణులు, కుమార్తెలు అందరి ఆశీస్సులు కోరేందుకు ఈరోజు వచ్చాను. కాశీ ఎంపీగా, దేశ ప్రధానమంత్రిగా, దేశ సంక్షేమం కోసం ఒక ప్రధాన లక్ష్యాన్ని సాధించడానికి నాకు మీ ఆశీస్సులు కావాలి. ఆ ప్రధాన లక్ష్యం లోక్‌సభ, విధానసభల్లో మహిళలకు రిజర్వేషన్లను అమలు చేయడం. ఈ సవరణ ద్వారా మరింత ఎక్కువ మంది మహిళలు అసెంబ్లీ, పార్లమెంటులోకి అడుగుపెట్టే అవకాశం లభించేది. కాంగ్రెస్, సమాజ్‌వాదీ పార్టీ, ఎవీజ, ఐవీఖ వంటి పార్టీలు మరోసారి దేశంలోని మహిళలకు ద్రోహం చేశాయి. గత 40 ఏళ్లుగా మహిళా రిజర్వేషన్ల అమలుకు ఈ పార్టీలే అడ్డుకట్ట వేశాయి. ఇప్పుడు సమాజ్‌వాదీ పార్టీ మరోసారి దీనికి 'రెడ్ సిగ్నల్' (అడ్డు) చూపించింది. మీ అందరికీ నేను హామీ ఇస్తున్నాను. మీ రిజర్వేషన్ హక్కులు అమలు అయ్యేలా చూడటానికి నేను శాయశక్తులా కృషి చేస్తాను. అసలు నిజం ఏమిటంటే, ఈ కుటుంబ రాజకీయాలు, బుజ్జగింపు రాజకీయాలపై ఆధారపడే పార్టీలన్నీ మహిళల శక్తిని చూసి భయపడుతున్నాయి. మీ అందరినీ చూసి వారు భయపడుతున్నారు. "

**నరేంద్ర మోదీ, ప్రధానమంత్రి**

అంతకుముందు ఉత్తర్‌ప్రదేశ్– ముంబయి మధ్య రైలు అనుసంధానాన్ని పెంచుతూ రెండు అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్ రైళ్లను ప్రధాని నరేంద్ర మోదీ ప్రారంభించారు. వారణాసి పర్యటనలో భాగంగా ప్రధాని ఈ రైళ్లను జెండా ఊపి ప్రారంభించారు. వారణాసి–పుణె, అయోధ్య–ముంబయి మార్గాల్లో ఈ రైళ్లు పరుగులు పెట్టనున్నాయి. కొత్తగా ప్రారంభించిన అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్ రైళ్ల ద్వారా కాశీ విశ్వనాథ క్షేత్రం, అయోధ్య రామ మందిరానికి చేరుకోవడం సులభతరమవుతుందని ప్రధాని మోదీ తెలిపారు. ముంబయి, పుణె వంటి మెట్రో నగరాల నుంచి నేరుగా రైలు సౌకర్యం కల్పించడం వల్ల పర్యాటక రంగానికి భారీ ఊతం లభిస్తుందని పేర్కొన్నారు. అత్యాధునిక సౌకర్యాలతో పాటు సామాన్యులకు అందుబాటులో ఉండేలా ఈ రైళ్ల రూపకల్పన జరిగినట్లు వెల్లడించారు.

# మణుగూరు ఏరియా సివిల్ ,పర్సనల్ డిపార్ట్మెంట్ లలో దీర్ఘకాలికంగా పనిచేస్తున్న, ఇంజనీర్లను,అధికారులను, సూపర్వైజర్లను బదిలీ చేయాలి

## జిఎం సివిల్ ధనసరి. వెంకటేశ్వర్లు కి, జిఎం పర్సనల్ కవిత నాయుడు కి వినతి పత్రాలు అందజేసిన సామాజిక సేవకులు కర్నే. బాబురావు



**హంస కలం వార్త, తెలుగు దినపత్రిక ఏప్రిల్ 29-26:** మణుగూరు ఏరియా సివిల్ మరియు పర్సనల్ డిపార్ట్మెంట్ లలో అధికారులను, సూపర్వైజర్లను ఇతర ఏరియాలకు బదిలీ చేయాలనీ కోరుతూ కొత్తగూడెం హెడ్ ఆఫీస్ లో జిఎం సివిల్ ధనసరి. వెంకటేశ్వర్లు కి, జిఎం పర్సనల్ కవిత నాయుడు కి వినతి పత్రాలు అందజేసినట్లు సామాజిక సేవకులు కర్నే. బాబురావు విలేకరులకు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ సింగరేణి మణుగూరు ఏరియాలో సివిల్ మరియు పర్సనల్ డిపార్ట్మెంట్లలో కొంతమంది అధికారులు సూపర్వైజర్లు, ప్రమోషన్లు తీసుకుని కూడా ఎన్నో ఏండ్లుగా ఇక్కడే ఫాతుకుపోయి ఇతర ఏరియాలకు ట్రాన్స్ఫర్ లు లేకపోవడంతో ఏక ఛత్రాధిపత్యంతో , మేము చెప్పిందే చట్టం, మేము చేసేదే న్యాయం మేము మొనార్కులం అంటూ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయన్నారు, క్రమశిక్షణ పేరుతో కార్మికులను ఎంతగా వేధిస్తే అంతగా తమకు ప్రమోషన్లు వస్తాయని అతిగా ప్రవర్తించే ఇలాంటి అధికారులతో మణుగూరు ఏరియాలో అశాంతి నెలకొంటుందని పారిశ్రామిక సంబంధాలు దెబ్బతింటున్నాయని ఏరియాలో సంస్థ ప్రయోజనాలకు శ్రేయస్కరం కాదని ఆయన అభిప్రాయపడ్డారు. కార్మిక సంఘాలు కూడా ఇలాంటి అధికారుల పట్ల తీవ్ర అసహనంతో ఉన్నారన్నారు, వాస్తవాలను పరిశీలించి తక్షణమే సంబంధిత అధికారులను, సూపర్వైజర్లను గుర్తించి ఇతర ఏరియాలకు ట్రాన్స్ఫర్ చేయాలని మణుగూరు ఏరియాకు మోక్షం లభించే దిశగా ఉన్నతాధికారులు దృష్టి పెట్టాలని ఆయన కోరారు. మణుగూరు ఏరియాలో కన్వినేన్స్ వాహనాల దుబారా కూడా అరికట్టాలని సంస్థకు ఆర్థిక నష్టం తగ్గించాలని ఏరియా జిఎంని కోరారు. స్పందించకపోతే సిఎండి, డైరెక్టర్లకు ఫిర్యాదు చేస్తారని తెలిపారు.

# ఫలితం ఏదైనా బిడ్డలను అక్కున చేర్చుకోండి పరీక్ష ఫలితాలు జీవితానికి ముగింపు కాదు - బాలానగర్ సీఐ

## విద్యార్థులకు, తల్లిదండ్రులకు బాలానగర్ పోలీసుల భరోసా..!

**హంస కలం వార్త, తెలుగు దినపత్రిక ఏప్రిల్ 29-26:** తెలంగాణలో టెన్త్ (గాజ-2026) రిజల్ట్స్ సందడి.. విద్యార్థుల్లో ఒకవైపు ఉత్కంఠ, మరోవైపు ఆందోళన. ఈ క్రమంలో బాలానగర్ పోలీసులు రంగంలోకి దిగారు. "మార్కుల కంటే ప్రాణం ముఖ్యం" అంటూ విద్యార్థులకు, తల్లిదండ్రులకు కీలక సూచనలు చేశారు. పదో తరగతి ఫలితాల నేపథ్యంలో బాలానగర్ సీఐ నర్సింహా రాజు విద్యార్థులకు కీలక సూచనలు చేశారు. పరీక్షల్లో వచ్చే మార్కులు కేవలం ఒక అంకె మాత్రమేనని, అవి జీవితాన్ని శాసించలేవని ఆయన స్పష్టం చేశారు. ఫలితాలు ఎలా ఉన్నా ఆత్మహత్య వంటి తీవ్ర నిర్ణయాలు తీసుకోవద్దని కోరారు. "ఫలితం ఏదైనా అది జీవితానికి ముగింపు కాదు.. తదుపరి విజయానికి మొదటి మెట్టు మాత్రమే" అని విద్యార్థులకు ధైర్యం చెప్పారు. ఫలితాల తర్వాత పిల్లలపై అనవసర ఒత్తిడి తీసుకురావద్దని, వారిని ఇతరులతో పోల్చి చిన్నబుచ్చవద్దని తల్లిదండ్రులను హెచ్చరించారు. పిల్లలు మౌనంగా ఉన్నా లేదా ఒంటరిగా ఉండటానికి ప్రయత్నిస్తున్నా.. వెంటనే వారితో ప్రేమగా మాట్లాడి ధైర్యం కల్పించాలన్నారు. తీవ్రమైన ఒత్తిడికి లోనవుతున్న విద్యార్థులు లేదా ఆందోళన చెందుతున్న తల్లిదండ్రులు వెంటనే '100' కు కాల్ చేయాలని లేదా మానసిక నిపుణుల సలహాలు తీసుకోవాలని సూచించారు. ఓటమిని చూసి కుంగిపోవద్దు.. గెలుపును చూసి పొంగిపోవద్దు. రేపటి బంగారు భవిష్యత్తుకు మీ ప్రాణమే పునాది. సైబరాబాద్ పోలీసులు ఎల్లవేళలా మీకు అండగా ఉంటారని సీఐ నర్సింహా రాజు అన్నారు.




# తెలంగాణ ప్రభుత్వ వెబ్ సైట్ లీక్

శేరిలింగంపల్లి **హంస కలం వార్త, తెలుగు దినపత్రిక ఏప్రిల్ 29-26:** తెలంగాణ ప్రభుత్వ వెబ్ సైట్ టి ఎస్ ఐ ఎఫ్ ఎం ఎస్ యొక్క యూజర్ ఐడి, పాస్ వర్డ్ ఇంకా ఓ.టీ.పీలు ప్రైవేట్ వ్యక్తులకు చేరవేస్తున్న వైనం రంగారెడ్డి జిల్లా, వికలాంగుల సంక్షేమ శాఖలో తాజాగా వెలుగులోకి వచ్చిందని తెలంగాణ దివ్యాంగుల సమైక్య సంఘం రాష్ట్ర అధ్యక్షులు మేకల అశోక్ కుమార్ ముదిరాజ్, తెలిపారు. సదరు భాదితులు తనను కలిసి విషయం చెప్పారని అనంతరం ఆయన మాట్లాడుతూ, నిర్లక్ష్యం వహిస్తున్న అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని అన్నారు. రంగారెడ్డి జిల్లా వికలాంగుల శాఖ నందు రిటైర్ ఐన ఒక ఉద్యోగి తనకు రావాల్సిన బిల్లులు మంజూరు చేయమని అధికారులను అడగగా కార్యాలయంలోని సంక్షేమ శాఖ అధికారిని ఎల్. శ్రీలత వికలాంగుల శాఖ సూపరిండెంట్ ఇమాముద్దీన్, మాకు బిల్లులు చేయడం రాదు, మీకు యూజర్ ఐడి, పాస్ వర్డ్ ఇంకా ఓ.టీ.పీలు ఇస్తాము మీకు బయటి వారి వద్ద పనిచేయించుకోండి అని నిర్లక్ష్యంగా సమాధానం చెబుతున్నారు. అని ఈ విషయమై, జిల్లా అధికారికి, జిల్లా కలెక్టర్ కి ఫిర్యాదు చేయగా ఇంతవరకు ఎటువంటి చర్య తీసుకోకపోవడం పలు అనుమానాలకు దారితీస్తుందని చేసేదిఏ మీలేక సదరు బాధితులు ప్రైవేటు వ్యక్తులతో డబ్బులు చెల్లించి బిల్లులు చేయించుకుంటున్నారు. బిల్లులు చేసిన ప్రైవేటు వ్యక్తుల



నుండి జిల్లా అధికారులకు కమిషన్ రూపంలో లావాదేవీలు జరుగుతున్నట్లు పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయని బాధితుడు అన్నారు. ప్రస్తుతం సైబర్ నేరాలు పోలీసు యంత్రంగానికి తలనొప్పిగా తయారైన పరిస్థితులో ఈ యూజర్ ఐడి, పాస్ వర్డ్ ఓ.టి.పిలు చేతులు మారడం, అవి తప్పుతోవ బట్టి సైబర్ నేరగాల చేతిలో పడితే పరిస్థితి ఏవిధంగా ఉంటుందో అధికారులు గమనించాలి. అని ఇకనైనా ప్రభుత్వ యంత్రాంగం కళ్ళు తెరిచి నిర్లక్ష్యం వ్యవహరిస్తున్న అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నామన్నారు.

# నిరుపేద ప్రజలు ఆత్మగౌరవంతో జీవించే విధంగా, ఇందిరమ్మ రాజ్యం ఏర్పడింది

## ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి

**హంస కలం వార్త, తెలుగు దినపత్రిక ఏప్రిల్ 29-26:** ఈరోజు గద్వాల నియోజకవర్గం గట్టు మండలం పరిధిలో,బల్గెర చమునా ఖాన్ దొడ్డి గ్రామంలో, ఇందిరమ్మ ఇల్లు నిర్మాణం పూర్తి ఇందిరమ్మ ఇల్లు ప్రారంభోత్సవం నూతన గృహప్రవేశ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా,ఎమ్మెల్యే శ్రీ బండ్ల కృష్ణమోహన్ రెడ్డి, హాజరయ్యారు. గట్టు మండలం పరిధిలోని చమన్ ఖాన్ దొడ్డి గ్రామంలో కురువ హనుమంతు,మంజూరు కావడం జరిగినది.నూతన గృహప్రవేశానికి ఎమ్మెల్యే,రిబ్బన్ కటింగ్ చేసి ప్రారంభించడం జరిగింది. నూతన ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశం చేసిన లబ్ధిదారులకు ఎమ్మెల్యే కానుకను అందజేశారు. ఎమ్మెల్యేకు లబ్ధిదారులు శాలువా కప్పి పుష్పగుచ్చం ఇచ్చి ఘనంగా సత్కరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ నూతన ఇందిరమ్మ ఇల్లు ను ప్రారంభించిన లబ్ధిదారులకు హార్దిక శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఇందిరమ్మ ఇళ్లు చేపట్టిన పథకం ఇందిరమ్మ ఇల్లు నిర్మాణం పూర్తి కావడం లబ్ధిదారులు నూతన గృహప్రవేశం చేయడం చాలా



సంతోషంగా ఉందని హర్షం వ్యక్తం చేశారు. గద్వాల నియోజకవర్గంలో మొదటి విడత లో 3500 ఇందిరమ్మ ఇల్లు మంజూరు కావడం జరిగినది. దాదాపుగా 1500 పైగా ఇండ్లు నిర్మాణం పనులు కొనసాగుతున్న. త్వరగా ఇంటి నిర్మాణం పనులు పూర్తి చేసుకొని గృహ ప్రవేశాలు చేయాలి. ఈ ఇందిరమ్మ రాజ్యంలో ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న పేదింటి ప్రజల సొంతింటి కల ప్రజాపాలన సీఎం రేవంత్ రెడ్డి గారి తో సాధ్యమైనది అని పేర్కొన్నారు. ప్రజలు ఎవరు కూడా ఆందోళన అపోహాలు పడాల్సిన అవసరం లేదు ఇల్లు కట్టించుకుంటే డబ్బులు రావని అపోహాలు వద్దు ఇల్లు రానివారికి ఎవరు కూడా అపోహ పడవద్దండి. రెండో విడతలో త్వరలో కూడా అర్హులైన లబ్ధిదారులు కు మంజూరు ఏవిధంగా కృషి చేస్తామని తెలిపారు. ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేసి నిర్మాణానికి సహకరించిన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సీఎం శ్రీ రేవంత్ రెడ్డి గారికి గృహనిర్మాణ శాఖ మంత్రివర్యులు శ్రీ పొంగిలేటి శ్రీనివాస్ రెడ్డి, గద్వాల నియోజకవర్గ ప్రజలందరి తరఫున ధన్యవాదాలు.. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంధాలయ మాజీ చైర్మన్ జంబు రామన్ గౌడు, మాజీ ఎంపీపీ విజయ్, జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షుడు రాజశేఖర్, సర్పంచ్ భీమయ్య, నాయకులు మహేశ్వర్ రెడ్డి, మైలగడ్డ చంద్రశేఖర్, రామకృష్ణ నాయుడు, నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# బుధవారం కూకట్ పల్లి రామాలయం వద్ద 27 అడుగుల ఏకశిల శ్రీ గరుడ, హనుమద్ మూర్తుల స్థాపన మహోత్సవ కార్యక్రమాల్లో







**హంస కలం వార్త, తెలుగు దినపత్రిక ఏప్రిల్ 29-26:** భాగంగా గ్రామ ప్రజలచే విగ్రహమూర్తులకు క్షీరాభిషేకం అంగరంగ వైభవంగా జరిగింది.. ఈ కార్యక్రమానికి బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ మాజీ మంత్రివర్యులు కేటీఆర్ మాజీ మంత్రి మల్లారెడ్డి, ఎమ్మెల్యే వివేక్ ,ఎమ్మెల్సీ శంబిపూర్ రాజు దర్శించుకొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు మాట్లాడుతూ 440 ఏళ్ల చరిత్ర గల ఈ కూకట్ పల్లి రామాలయం వద్ద శ్రీ గరుడ, హనుమద్ మూర్తుల స్థాపనతో కూకట్ పల్లి దేదీప్యమానంగా వెలుగుతోందని.. గ్రామస్తులు సహకారంతో ఈ కూకట్ పల్లి రామాలయాన్ని పునర్నిర్మించుకుని ఆ సీతారామ చంద్రులు ఆశీస్సులు పొందామని... ప్రజలంతా కూడా సుఖసంతోషాలతో ఆయురారోగ్యాలతో పల్లెలు పాడిపంటలతో కళకళలాడుతూ ఉండాలని ఆకాంక్షించారు... అనంతరం అన్నదాన కార్యక్రమం జరిగింది... ఈ కార్యక్రమములో దేవాలయము చైర్మన్ ఎన్. శ్రీనివాస్ రావు (చిన్న తులసి) నియోజకవర్గం కో ఆర్డినేటర్ సతీష్ అరోరా, మాజీ కార్పొరేటర్లు మాధవరం రోజాదేవి రంగారావు, ముద్దం నరసింహ యాదవ్, ఆవుల రవీందర్ రెడ్డి, తూము శ్రావణ్ కుమార్, పండాల సతీష్ గౌడ్, పగుడలా శిరీష బాబురావు,, మహేశ్వరీ శ్రీహరి, మాజీ ఛైర్మన్స్, నాయకులూ , మహిళలు భారీగా పాల్గొన్నారు

# మీడియా అకాడమీ మరియు రాష్ట్ర అక్రెడిటేషన్ కమిటీ చైర్మన్ చైర్మన్ కె. శ్రీనివాస్ రెడ్డి





**హంస కలం వార్త, తెలుగు దినపత్రిక ఏప్రిల్ 29-26:** సమాచార శాఖ కమిషనర్ ముకుందరెడ్డి గార్లతో ఇవ్వాళ సమాచార భవన్ లో జరిగిన సమావేశంలో, జిల్లాల్లో అక్రెడిటేషన్ కార్డుల జారీలో ఎదురవుతున్న కొన్ని సమస్యలను తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం (ఒఖఔజీ) బాధ్యుడిగా వారి దృష్టికి తెచ్చాను. మండల స్థాయిలో అక్రెడిటేషన్ కార్డుల జారీలో విద్యార్హత లేదా అనుభవం ఉంటే సరిపోతుందని జీవోలో స్పష్టంగా పేర్కొన బడినప్పటికీ, పలు జిల్లాల్లో రెండు అవసరమని కలెక్టర్లు నిబంధన పెట్టారనే విషయాన్ని ఆయా జిల్లాల జర్నలిస్టు మిత్రులు నా దృష్టికి తెచ్చారు. ఈ విషయాన్ని నేను ఇవాల్టి సమావేశంలో ప్రస్తావించగా, అందులో ఏ ఒక్కటి ఉన్నా కార్డులు మంజూరీ చేయాలని శ్రీనివాస్ రెడ్డి , ముకుందరెడ్డి ఆదేశాలు జారీ చేసారు. అలాగే మండల స్థాయి అక్రెడిటేషన్ కార్డుకు కూడా జాూ సర్టిఫికెట్ సమర్పించాలనే నిబంధనను సవరించేందుకు చర్యలు చేపడతామని వారు హామీ ఇచ్చారు.

# కూకట్ పల్లి రామాలయంలో శ్రీ గరుడ, హనుమ మూర్తి స్థాపన కార్యక్రమంలో ప్రత్యేక పూజలు







**హంస కలం వార్త, తెలుగు దినపత్రిక ఏప్రిల్ 29-26:** గరుడ, హనుమ మూర్తి స్థాపన మహోత్సవ కార్యక్రమంలో భాగంగా 28వ తేదీ మంగళవారం నాడు రామాలయంలో శాంతి పాఠం, మూలమంత్ర హవనాలు, శ్రీ నరసింహ ఇష్టి, పూర్ణాహుతి కార్యక్రమాలు జరిగాయి. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ఎమ్మెల్సీ రాజ్, ఎమ్మెల్యే వివేక్ నంద టిఆర్ఎస్ కార్యకర్తలు పాల్గొన్నారు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు మాట్లాడుతూ శ్రీ గరుడ, హనుమ మూర్తుల స్థాపన మహోత్సవ కార్యక్రమం సందర్భంగా రామాలయంలో ప్రతిరోజు నిత్య హోమాలు, వివిధ రకాల కైంకర్యాలు స్వామివారికి జరుగుతున్నాయని, ఈ సందర్భంగా 29వ తేదీన ప్రజలందరూ కూడా గరుడ, హనుమ మూర్తులకు స్వయంగా క్షీరాభిషేకం చేసుకునే భాగ్యం కలుగుతుందని, ప్రజలందరూ కూడా ఇంతటి మహత్తర కార్యక్రమంలో పాల్గొని ఆ సీతారామచంద్రస్వామి వార్ల ఆశీస్సులు పొందగలరని ఆకాంక్షించారు.

# కూకట్‌పల్లి చిత్తరమ్మ ఆలయ ప్రాంగణంలోని ఫంక్షన్ హాల్‌లో జరిగిన చిన్నారి కావ్యశ్రీ నూతన వస్త్రాలంకరణ వేడుక ఘనంగా నిర్వహించబడింది



**హంస కలం వార్త, తెలుగు దినపత్రిక ఏప్రిల్ 29-26:** మిత్రులు వెంకటరెడ్డి ఆహ్వానం మేరకు రాష్ట్ర బీజేపీ సీనియర్ నాయకులు వడ్డేపల్లి రాజేశ్వరరావు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా చిన్నారి కావ్యశ్రీకి నూతన వస్త్రాలు అలంకరించి సంప్రదాయబద్ధంగా ఆశీర్వచనాలు అందజేశారు. అనంతరం వడ్డేపల్లి రాజేశ్వరరావు చిన్నారిని ఆశీర్వదిస్తూ, ఆమె భవిష్యత్తులో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని, ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో ఎదగాలని ఆకాంక్షించారు.

# చెరువుల మరమ్మత్తుల కోసం 38 లక్షల ఫండ్ భూమి పూజ చేయడం జరిగింది





సదాశివపేట **హంస కలం వార్త, తెలుగు దినపత్రిక ఏప్రిల్ 29-26:** సదాశివపేట మండలం నిజాంపూర్ గ్రామంలో చెరువు ,దక్కలచెరువుల మరమ్మత్తులకు మరియు బతుకమ్మ మెట్ల కొరకు కొల్కూరు గ్రామంలో నల్లచెరువు మరియు బతుకమ్మ మెట్ల కొరకు.. టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి 18 లక్షల రూపాయల పండ్ కోల్కూర్ 20 లక్షలు రూపాయల ఫండ్ పెట్టడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నిర్మల జగ్గారెడ్డి ఆధ్వర్యంలో భూమి పూజ చేయడం జరిగింది .ఈ కార్యక్రమంలో సి డి సి చైర్మన్ రామ్ రెడ్డి ,మండల అధ్యక్షులు ఒగ్గ శ్రీనివాస్, నిజాంపూర్ గ్రామ సర్పంచ్ తులసి సత్యనారాయణ , మాచిరెడ్డిపల్లి సర్పంచ్ మోహన్ గౌడ్ , కంబాలపల్లి సర్పంచ్ ఇందూరి బాబు, మాణిక్ రెడ్డి, లక్ష్మారెడ్డి , ధనరాజ్ వార్డ్ నెంబర్లు నల్ల బాలయ్య , సాబీర్, జయరాజ్, మల్లేశం, సందీప్, రమేష్,చంద్రమౌళి ,అనంతకృష్ణ ,శేకర్ నరసమ్మ మొనగారి శ్రీనివాస్ మాజీ సర్పంచులు, శ్రీనివాస్ రెడ్డి జంగిలి శ్యామల గోపాల్ గ్రామ పెద్దలు పాల్గొనడం జరిగింది

# పేదవారి సొంతింటి కలను నిజం చేయడమే తమ ప్రభుత్వా లక్ష్యం

## టీజీఐఐసీ చైర్మన్ నిర్మల జగ్గారెడ్డి.

## సొంతిల్లు కట్టుకుంటామని కలలో కూడా ఊహించలేకపోయాం.

## ఆనందభాష్పాలతో నిర్మల జగ్గారెడ్డికి కృతజ్ఞతలు.

## లబ్ధిదారులు ముబారక్పూర్ స్వరూప.





సదాశివపేట **హంస కలం వార్త, తెలుగు దినపత్రిక ఏప్రిల్ 29-26:** సదాశివపేట మండలంలోని కోల్కూర్ గ్రామానికి చెందిన ఇందిరమ్మ ఇల్లు లబ్ధిదారులు ముబారక్పూర్ స్వరూప ప్రభు ఇందిరమ్మ ఇళ్లు గృహప్రవేశం టీజీఐఐసీ తూర్పు నిర్మల జగ్గారెడ్డి చేతులు మీదుగా ప్రారంభించడం జరిగింది. ఈ సందర్భంగా నిర్మల జగ్గారెడ్డి మాట్లాడుతూ పేదవారి సొంతింటి కలను నిజం చేయడమే, తమ ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. ఇందిరమ్మ ఇల్లు లబ్ధిదారులు ముబారక్పూర్ స్వరూప సొంత ఇల్లును కట్టుకుంటామని తాము కలలో కూడా ఊహించలేకపోయామని , తమ ఆనంద భాష్పాల ద్వారా నిర్మల జగ్గారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సి డి సి చైర్మన్ గడీల రామ్ రెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు ఒగ్గ శ్రీనివాస్, సర్పంచులు మాచిరెడ్డిపల్లి మోహన్ గౌడ్, కంబాలపల్లి సర్పంచ్ ఇందూరిబాబు, నిజాంపూర్ సర్పంచ్ సత్యనారాయణ, కోల్కూర్ నాయకులు మాణిక్ రెడ్డి, లక్ష్మారెడ్డి, ధనరాజ్, వార్డు సభ్యులు సాబీర్, సందీప్, రమేష్, చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

# జోనల్ కమిషనర్, నారాయన్ అమిత్ ఐఏఎస్ పటాన్‌చెరు సర్కిల్-46 పరిధిలో విస్తృత క్షేత్రస్థాయి పర్యటన చేపట్టారు






**హంస కలం వార్త, తెలుగు దినపత్రిక ఏప్రిల్ 29-26:** ఈ పర్యటనలో భాగంగా ముందుగా పారిశుధ్య కార్మికులతో ప్రత్యక్షంగా మాట్లాడి వారి సమస్యలు, పనితీరును అడిగి తెలుసుకున్నారు. క్షేత్రస్థాయిలో పారిశుధ్య నిర్వహణను మెరుగుపరచాలని అధికారులను ఆదేశించారు. అనంతరం జీవీపీ పాయింట్లను సందర్శించి చెత్త నిర్వహణ తీరును పరిశీలించారు. విలీన మున్సిపాలిటీలలో డ్రైనేజీ వ్యవస్థల పనితీరును సమీక్షించి, వర్షాకాలం దృష్ట్యా పూడికతీత పనులు వేగవంతం చేయాలని సూచించారు. కొల్లూరు 2దీఎఖ హౌసింగ్ కాలనీలో నివాసితులతో సమావేశమై మౌలిక సదుపాయాలు, పారిశుధ్యం, నీటి సరఫరా వంటి ప్రజా సమస్యలపై అభిప్రాయాలు సేకరించారు. ప్రజల నుండి వచ్చిన ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. చివరగా కొల్లూరు డంపింగ్ యార్డును సందర్శించి అక్కడి చెత్త నిర్వహణ, ప్రాసెసింగ్ పనులను పరిశీలించారు. డంపింగ్ యార్డు నుండి వచ్చే సమస్యలను శాస్త్రీయ పద్ధతిలో పరిష్కరించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై అధికారులతో చర్చించారు. ప్రజారోగ్యం, పరిశుభ్రతే ప్రధాన లక్ష్యంగా అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేయాలని జోనల్ కమిషనర్ ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ జ్యోతి కమిషనర్ అలాగే సంబంధిత అధికారులు పాల్గొన్నారు

# ఆపరేషన్ దుర్గం చెరువు



సైకో ఇచ్చిన వన్ మినిట్ టాస్క్‌ను సక్సెస్‌ఫుల్‌గా కంప్లీట్ చేశాడు ఇన్‌స్పెక్టర్ రుద్ర. ఇంతలో దుర్గం చెరువు కేబుల్ బ్రిడ్జి మీద ఓ పిల్లాడు వేలాడుతున్నట్టు రుద్రకు సమాచారం వచ్చింది. దీంతో టీమ్‌తో అక్కడికి ప్రయాణమయ్యాడు. దారిలో వెళ్తున్న రుద్రకు 'ఆ పిల్లాడిని మామూలుగా వదిలేస్తే కిక్ ఏముంది చెప్పు??' అన్న సైకో మాటలే మెదడులో గిర్రున తిరుగుతున్నాయ్. అంటే, నెక్స్ట్ విడిచిపెట్టే పిల్లాడిని అంత ఈజీగా సైకో వదిలిపెట్టడని అర్థమైపోయింది. పది నిమిషాల్లో దుర్గం చెరువు వచ్చింది. కేబుల్ బ్రిడ్జి మీదినుంచి ఓ పెద్ద సంచిలో ఓ పిల్లాడిని ఎవరో వేలాడదీశారు. అయితే, సంచిలో ఎలాంటి కదలికలూ కనిపించలేదు. బ్రిడ్జి మీదినుంచి వేలాడుతున్న పిల్లాడిని ఎందుకు పైకి లాగలేదని రుద్ర అక్కడ ఉన్న సిబ్బందిని గద్దించాడు. దీంతో సంచికి కట్టిన తాడు మొదట్లో ఓ లెటర్ అతికించి ఉందన్న విషయాన్ని రుద్రకు చెప్పారు అక్కడి కానిస్టేబుల్స్. బ్రిడ్జి మీదికి ఏ వాహనాలూ రాకుండా ట్రాఫిక్‌ను మళ్లించి ఆ లెటర్ చదవడం ప్రారంభించాడు.

'హలో రుద్రా.. పిల్లల్లో ఒకడిని ఈ సంచిలో పెట్టి వేలాడదీసింది నేనే. సీసీటీవీ ఫుటేజీ వగైరా అంటూ టైమ్ వేస్ట్ చేసుకోకుండా నేను ఇచ్చే రెండు పజిల్స్‌ను నిమిషంలో సాల్వ్ చెయ్యి. ఒకవేళ జవాబు తప్పుగా చెప్పినా లేక, ఇన్‌టైమ్‌లో ఆన్సర్ చేయలేకపోయినా.. పిల్లాడికి కట్టిన తాడు దానంతట అదే ఊడిపోతుంది. పిల్లాడు అంతెత్తు నుంచి నీటిలో పడిపోతాడు. పాపం.. మత్తులో ఉన్నాడు కదా.. ఈత కొట్టే అవకాశం కూడా ఉండదు. మరో విషయం.. నీ పోలీసు బుద్ధితో ఇప్పుడే పిల్లాడిని విడిపించుకోవాలని చూస్తావేమో! ఆ ప్రయత్నం చేస్తే.. అబ్బాయే కాదు.. మొత్తం బ్రిడ్జి పేలిపోతుంది. మరి ఈ 'ఆపరేషన్ దుర్గం చెరువు'ను సక్సెస్‌ఫుల్‌గా పూర్తి చేస్తావా?' అంటూ లెటర్ ముగించాడు సైకో. ఇంతలో ఆకాశం నుంచి ఓ డ్రోన్ ద్వారా ఓ లెటర్ రుద్ర ముందు పడింది. దాన్ని తెరిచి చదవడం ప్రారంభించాడు రుద్ర. 'మిస్టర్ రుద్రా.. ఇప్పుడు టైమ్ రాత్రి 10.20 గంటలు. 10.30 గంటల నుంచి 10.31 గంటల వరకూ అంటే ఒక్క నిమిషంలో నేను అడిగే పజిల్‌కు నువ్వు ఆన్సర్ చేయాలి. క్వశ్చన్లు సరిగ్గా 10.30 గంటలకు ఈ డ్రోన్ నుంచి ఓ లెటర్ రూపంలో కింద పడతాయి. నువ్వు ఆన్సర్స్‌ను డ్రోన్‌లోని వాయిస్ రికార్డర్‌కు వినిపించేంత గట్టిగా ఒక్క నిమిషంలో చెప్పాలి. సమాధానం కరెక్ట్ అయితే.. పిల్లాడు, బ్రిడ్జి రెండూ సేఫ్.. లేదంటే.. పిల్లాడు, బ్రిడ్జ్ రెండూ ఫినిష్! వెయిట్ ఫర్ మై క్వశ్చన్స్' అని రాసి ఉంది. దీంతో రుద్ర హార్ట్‌బీట్ మరింతగా పెరిగింది. సమయం.. రాత్రి 10.30 గంటలు. డ్రోన్ నుంచి ఓ లెటర్ కిందపడింది. అందులో ఇలా ఉంది.. 'రుద్రా.. మొదటి ప్రశ్న.. సునందకు నలుగురు కూతుళ్లు. ప్రతీ కూతురికి ఒక బ్రదర్ ఉన్నాడు. ఇప్పుడు సునందకు ఎంతమంది పిల్లలు ఉన్నారో.. సంచిలో ఉన్న ఈ అబ్బాయి ఇంట్లో కూడా అంతమంది ఉంటారు. ఈ అబ్బాయి ఎవరి కొడుకు? రెండో ప్రశ్న.. కుడి చెయ్యి చేసే ప్రతీ పనిని.. ఎడమ చెయ్యి కూడా చేయగలదు. అయితే ఒక్కపని తప్ప. అదేంటో గట్టిగా అరిచి చెప్పు' అని ఉంది. ప్రశ్నలు చదవడానికే అర నిమిషం పూర్తయింది. దీంతో అప్రమత్తమైన రుద్ర.. ఐదుగురి పిల్లల పేరెంట్స్‌ను వెంటనే పిలిచి.. ఎవరింట్లో ఎంతమంది ఉంటారో అడిగాడు. మొదటి వ్యక్తి 8, రెండో వ్యక్తి 9, మూడోవ్యక్తి 5, నాలుగో వ్యక్తి 6, ఐదో వ్యక్తి ఏడుగురు అని సమాధానం చెప్పారు. దీంతో సంచిలో ఉన్న పిల్లాడు ఎవరి కొడుకో రుద్ర గట్టిగా అరిచి చెప్పాడు. ఇంకో పది సెకండ్ల టైమ్ మాత్రమే మిగిలి ఉంది. కుడి చెయ్యి-ఎడమ చెయ్యి పజిల్‌కు ఆన్సర్ ఏంటో రుద్రకు స్ఫురించట్లేదు. ఏమైతుందోనని అంతా ఒకటే టెన్షన్. ఇంతలో ఏదైతే అదైందని తాను అప్పటికప్పుడు అనుకొన్న ఆన్సర్‌ను గట్టిగా అరిచి చెప్పాడు రుద్ర. అయితే, గాలి గట్టిగా వీయడంతో వాయిస్ రికార్డర్‌కు ఆ శబ్దం వినబడలేదు. దీంతో మరో మూడు సెకండ్లు ఉందనగా.. రుద్ర మళ్లీ గట్టిగా అరిచి రెండో పజిల్ ఆన్సర్ చెప్పాడు. టైమ్ పూర్తయ్యింది. తాను చెప్పిన ఆన్సర్లు కరెక్ట్.. అవునా? కాదా? అని రుద్రతో పాటు అందరూ టెన్షన్‌తో ఎదురు చూస్తున్నారు.

రెండు నిమిషాల తర్వాత మరో డ్రోన్ అక్కడికి వచ్చి ఓ లెటర్‌ను కిందకు విసిరేసింది. 'బ్రిలియంట్ రుద్ర. నా రెండు పజిల్స్‌కు నువ్వు కరెక్ట్‌గా ఆన్సర్ చేశావ్. సో.. ఆపరేషన్ దుర్గం చెరువు సక్సెస్. ఇక ఈ పిల్లాడిని నువ్వు తీసుకెళ్లొచ్చు. అయితే, ఈ పిల్లాడిని నువ్వు వాళ్ల ఇంటికి తీసుకెళ్తావా? లేక శ్మశానానికా? మరిన్ని వివరాల కోసం.. నీ మొబైల్‌లో మెసేజ్ చూడు' అని ఆ లెటర్‌లో ఉంది. అది చదవగానే రుద్ర కాళ్లకింద భూకంపం వచ్చినంత పనైంది. అంతలోనే ఓ ఇంటర్నెట్ స్పామ్ నంబర్ నుంచి అప్పుడే రుద్ర ఫోన్‌కు మెసేజీ డెలివరీ అయ్యింది. కంగారుగా ఓపెన్ చేశాడు రుద్ర 'హాయ్ రుద్రా.. టెన్షన్ అంటే ఏంటో మొదటిసారి చూస్తున్నావా? ఇది జస్ట్ ఫస్ట్ రౌండ్ మాత్రమే. అసలు ఆట ముందు ఉంది. ఈ పిల్లాడికి నేను ఓ ఇంజెక్షన్ ఇచ్చా. అయితే, ఎలాంటి విషాన్ని, మందును, కనీసం నీళ్లను కూడా నేను ఆ బాబు ఒంట్లోకి ఎక్కించలేదు. అయినప్పటికీ కొద్దిసేపట్లో అతను చనిపోతాడు. అసలేం జరిగిందో టెస్టులు చేసి డాక్టర్లు తెలుసుకొనే లోపే పిల్లాడి ప్రాణాలు గాలిలో కలిసిపోతాయి. అందుకే, ఈ బాబును డైరెక్టుగా శ్మశానానికి తీసుకుపో.. లేదు. కాపాడతా అంటావా? అయితే, నా ఇన్ఫర్మేషన్‌లోనే ఆన్సర్ ఉంది. దమ్ముంటే కాపాడుకో' అని ఆ మెసేజీలో ఉంది. దీంతో కంగారు పడిపోయిన రుద్ర.. హుటాహుటిన పిల్లాడిని హాస్పిటల్‌కు తీసుకెళ్లాడు. టెస్టులకు సమయం పడితే, పిల్లాడి ప్రాణాలకే ప్రమాదం అని గ్రహించిన రుద్ర.. సైకో ఇచ్చిన ఇన్ఫర్మేషన్‌ను డీకోడ్ చేసి అసలు సమస్యేంటో డాక్టర్స్‌కు చెప్పాడు. దీంతో ఆ డైరెక్షన్‌లోనే టెస్టులు చేసిన వైద్యులు సమస్య అదే అని కనిపెట్టారు. సకాలంలో వైద్యం చేయడంతో పిల్లాడు ప్రాణాలతో బతికి బయటపడ్డాడు. ఇంతకీ, సైకో అడిగిన రెండు పజిల్స్‌కు సమాధానమేంటి? పిల్లాడికి సైకో ఏ ఇంజెక్షన్ ఇచ్చినట్టు? దాన్ని రుద్ర ఎలా కనిపెట్టినట్టు??

**సమాధానం:** మొదటి పజిల్‌లో సునందకు నలుగురు కూతుళ్లు అని సైకో చెప్పాడు. ప్రతీ కూతురికి ఒక బ్రదర్ అని కూడా చెప్పాడు. అంటే ఈ లెక్కన సునందకు నలుగురు కూతుళ్లు, ఒక కొడుకు. అంటే సునందకు మొత్తం ఐదుగురు సంతానం. మూడో వ్యక్తి ఐదుగురు అన్నాడు. అంటే అతనే పిల్లాడి తండ్రి. ఇక, రెండో పజిల్‌లో కుడి చెయ్యి చేసే ప్రతీ పనిని.. ఎడమ చెయ్యి కూడా చేయగలదు. అయితే ఒక్కపని తప్ప అని సైకో అడిగాడు. ఎడమ చెయ్యి తన మోచేతిని తాకలేదు. అయితే, కుడి చెయ్యి ఎడమ చెయ్యి మోచేతిని తాకగలదు. ఇదే ఆన్సర్. దీన్ని రుద్ర కరెక్ట్‌గా చెప్పాడు. ఇక, ఎలాంటి విషాన్ని, మందును, కనీసం నీళ్లను కూడా లేని ఇంజెక్షన్‌ను పిల్లాడికి ఇచ్చానని సైకో చెప్పాడు. అంటే పిల్లాడికి సైకో ఎయిర్ ఎంబ్లాయిజమ్ (రక్త నాళాల్లోకి గాలిని ఎక్కించడం) చేశాడని రుద్ర కనిపెట్టాడు. డాక్టర్లకు ఆ విషయాన్ని చెప్పడంతో సకాలంలో చికిత్స అంది పిల్లాడు బతికి బయటపడ్డాడు.

# బంజారాలకు పదవేది?

ఇరవై ఏండ్ల పోరాట ఫలితంగా బంజారాలకు 1976లో విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో రిజర్వేషన్లు దక్కాయి. నాటి నుంచి కాంగ్రెస్ పాలనలో మంత్రిమండలికి బంజారా జాతి ప్రాతినిధ్యం వహించింది తొమ్మిదేండ్ల ఐదు నెలలు మాత్రమే. టీడీపీ పదిహేడు ఏండ్ల పాలనలో 1989లో ఎన్టీ రామారావు మంత్రివర్గంలో అజ్మీరా చందులాల్‌కు మంత్రిగా అవకాశం దక్కింది. ఆ తర్వాత 1995-2004 వరకు ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబు ఏనాడూ బంజారా జాతికి తన మంత్రిమండలిలో అవకాశం ఇవ్వలేదు. ఇప్పుడు ఆయన దారిలోనే తన శిష్యుడు రేవంత్‌రెడ్డి కూడా నడుస్తుండటం గమనార్హం. తెలంగాణలో సుమారు ఏడు శాతం జనాభా ఉన్న బంజారాలకు మంత్రి వర్గంలో ప్రాతినిధ్యం లేని సందర్భాలు రెండే రెండు. ఒకటి, చంద్రబాబు హయాంలో, రెండు ప్రస్తుతం రేవంత్‌రెడ్డి ప్రజాపాలనలో. బంజారా ఓట్లను వాడుకొని అధికారం చేపట్టిన రేవంత్‌రెడ్డి ఇప్పుడు బంజారాల గొంతు నొక్కేందుకు ప్రయత్నిస్తున్నారు. తన మంత్రిమండలిలో బంజారాలకు అవకాశం ఇవ్వకపోవడమే అందుకు నిదర్శనం. పద్నాలుగేండ్ల పాటు తెలంగాణ ఉద్యమంలో బంజారా జాతి కేసీఆర్ వెన్నంటే నిలిచింది. ఆ తర్వాత కూడా పదేండ్ల పాటు గిరిజన బిడ్డలు గులాబీ జెండాకు అండగా నిలబడ్డారు. ఈ విషయాన్ని గ్రహించిన కేసీఆర్ రెండు పర్యాయాలు తన మంత్రివర్గంలో బంజారాలకు అవకాశం కల్పించారు. మొదటి పర్యాయం అజ్మీరా చందులాల్, బీఆర్ఎస్ రెండోసారి అధికారం చేపట్టాక సత్యవతి రాథోడ్ మంత్రులుగా బంజారా జాతికి ప్రాతినిధ్యం వహించారు. ఇద్దరు కలిసి ఏడేండ్ల 9 నెలల పాటు మంత్రులుగా సేవలందించారు.

బీఆర్ఎస్ పాలనలో బంజారాల అభ్యున్నతికి కేసీఆర్ ఎంతో కృషి చేశారు. ప్రభుత్వం తరఫున నిధులు కేటాయించి బంజారాల ఆరాధ్య దైవం సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతిని నిర్వహించారు. బంజారాహిల్స్‌లో సేవాలాల్ పేరిట ఆత్మగౌరవ భవనాన్ని నిర్మించారు. 'మా తండాలో మా రాజ్యం' కలను సాకారం చేస్తూ తండాలు, గూడేలను గ్రామపంచాయతీలుగా ఏర్పాటు చేసి స్వయం పాలనకు పునాది వేశారు. ఎస్టీ రిజర్వేషన్లను 10 శాతానికి పెంచారు. ఢిల్లీలో ప్రభుత్వ అధికార ప్రతినిధిగా రిటైర్డ్ ఐఏఎస్ రామచంద్ర తేజావత్‌ను నియమించారు. గవర్నర్ కోటాలో రాములు నాయక్‌కు ఎమ్మెల్సీగా అవకాశమి చ్చారు. నాతోపాటు గాంధీ నాయక్, వాలియా నాయక్‌లకు రాష్ట్ర కార్పొరేషన్ చైర్మన్లుగా అవకాశం కల్పించారు. టీఎస్‌పీఎస్సీ సభ్యులుగా డాక్టర్ చంద్రావతి



రమావత్ ధన్‌సింగ్ నాయక్, ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యులుగా రాంబల్ నాయక్, రాంబాబు నాయక్, సమాచార కమిషనర్‌గా గుగులోతు శంకర్ నాయక్‌లకు అవకాశం ఇచ్చి బంజారా జాతిని గౌరవించారు. అంతేకాదు, 70 ఏండ్ల స్వతంత్ర భారత్‌లో ఎన్నడూ వెలుగులకు నోచుకోని తండాల్లో 24 గంటల కరెంట్‌ను సరఫరా చేశారు. రాష్ట్రంలోని 58 నియోజకవర్గాల్లో బంజారా ఆత్మగౌరవ భవనాలను నిర్మించారు. గురుకుల పాఠశాలలు, కళాశాలలు నిర్మించి గిరిజన జాతి ఉన్నతికి తోడ్పడ్డారు. నాలుగు లక్షల ఎకరాల పోడు పట్టాలు పంచిపెట్టిన కేసీఆర్‌ను బంజారా జాతి ఎప్పటికీ మర్చిపోదు. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ మాయమాటలను నమ్మి, ఆరు గ్యారెంటీలకు ఆకర్షితులై అందరిలాగానే గిరిజన జాతి కూడా మోసపోయింది. రేవంత్ ప్రభుత్వం ఏర్పడటంలో 30-45 నియోజకవర్గాల్లోని గిరిజనుల ఓట్లు కీలకపాత్ర పోషించాయి. కానీ, రేవంత్‌రెడ్డి మాత్రం నేడు తన మంత్రిమండలిలో బంజారాల గళం లేకుండా చేశారు. కేసీఆర్ సర్కారు అమలు చేసిన సంక్షేమ పథకాలను నిలిపివేసి, గిరిజనులను నమ్మించి మోసం చేశారు. ఈ నేపథ్యంలోనే కాంగ్రెస్‌ను బొందపెట్టేందుకు యావత్ బంజారా జాతి సిద్ధంగా ఉన్నది.

# నోటి క్యాన్సర్ హెచ్చరికలు



ప్రపంచవ్యాప్తంగా నోటి క్యాన్సర్ కేసుల సంఖ్య పెరుగుతున్నది. నోరు, పెదవులు, నాలుక, గొంతు భాగాల్లో నోటి క్యాన్సర్ ప్రభావం చూపుతుంది. ఏటా వేలాది మంది ఉసురు తీస్తున్నది. తొలి దశలో వ్యాధిని గుర్తించడమే చికిత్సకు, రోగి త్వరగా కోలుకోవడానికి కీలకంగా నిలుస్తుంది. లక్షణాలు గుర్తించకపోతే క్యాన్సర్ నిర్ధారణ ఆలస్యమైపోతుంది. కాబట్టి, నోటి క్యాన్సర్ ముప్పు తగ్గించుకోవడానికి కొన్ని హెచ్చరికలు కనిపిస్తాయి. వాటినినిర్లక్ష్యం చేయకూడదు.

**నోట్లో పుండ్లు :** నోట్లో ఏర్పడిన పుండ్లు రెండు వారాల్లోగా తగ్గకపోతే అనుమానించాల్సిందే. అయితే, కొన్నిసార్లు పుండ్లు త్వరగా తగ్గిపోయినప్పటికీ, క్యాన్సర్ మాత్రం అలాగే ఉండిపోతుంది. ఈ పుండ్లు పెదవులు, చిగుళ్లు, బుగ్గల లోపలి భాగంలో కనిపిస్తాయి. వీటినుంచి రక్తం కారొచ్చు. లేదంటే ఇబ్బందికరంగా అనిపించవచ్చు. దంత వైద్యుణ్ని కలిసి పరీక్ష చేయించుకోవడం వ్యాధిని తొలిదశలో గుర్తించడానికి వీలు కనిపిస్తుంది.

**మొద్దుబారడం, నొప్పి :** నోట్లో ఎడతెగకుండా నొప్పి, మొద్దుబారినట్టు ఉండటం, నోరు, గొంతు, పెదవుల భాగాల్లో మంటగా అనిపించడం నోటి క్యాన్సర్‌కు సంకేతం కావొచ్చు. వీటిని సాధారణంగా దంత సమస్యలుగానో, నరాల సమస్యలుగానో పొరబడుతుంటారు.

**మింగడంలో ఇబ్బంది :** మింగడం, నమలడం, నాలుక, దవడ కదపడంలో ఇబ్బందిగా ఉంటే తేలిగ్గా తీసుకోకూడదు. ఇది నోటి క్యాన్సర్ తొలిదశ సంకేతం కావొచ్చు. గొంతులో గడ్డలా అనిపిస్తుంది. దీంతో ఆహారం లోపలికి వెళ్లడం ఇబ్బందిగా ఉంటుంది. యాసిడ్ రిఫ్లక్స్, ఇతర ఇన్ఫెక్షన్ల వల్ల కూడా ఇలా జరుగుతుంది. కానీ, ఎక్కువ రోజులు సమస్య కొనసాగితే నిర్లక్ష్యం చేయకూడదు.

**నోటి దుర్వాసన :** నోటి దుర్వాసనను చాలామంది మామూలు విషయంగా భావిస్తారు. అయితే, ఇది ఎక్కువ కాలంపాటు కొనసాగితే జాగ్రత్త వహించాలి. నోటి దుర్వాసన నోటి క్యాన్సర్‌కు తొలిదశ సంకేతం కూడా అవ్వొచ్చు.

**గడ్డలు, వాపులు :** నోరు, మెడ, దవడల్లో గడ్డలు, మందపాటి ప్యాచెస్, వాపు లాంటివాటిని అంతగా పట్టించుకోరు. తెలుపు, ఎరుపు ప్యాచ్‌ల రూపంలో నోటి క్యాన్సర్ లక్షణాలు బయల్పడతాయి. గడ్డల రూపంలోనూ ఉంటాయి. కాబట్టి, క్రమం తప్పకుండా నిపుణులను సంప్రదిస్తే నోటి క్యాన్సర్‌ను తొలిదశలోనే గుర్తించవచ్చు.

**తగ్గించుకోవడం ఎలా :** ఒక లక్ష మందిలో 11 మందికి వారి జీవితకాలంలో నోటి క్యాన్సర్ అభివృద్ధి చెందే ముప్పు ఉంటుంది. పురుషుల్లో ఈ రిస్క్ ఎక్కువ. దీనికి కొన్ని కారణాలు ఉన్నాయి.

**ధూమపానం:** పొగాకు ఏ రూపంలో తీసుకున్నా నోటి క్యాన్సర్ రావొచ్చు. కాబట్టి, పొగతాగడం, జర్దాలాంటివి తినడం పూర్తిగా మానేయాలి.

**మద్యపానం:** నోటి క్యాన్సర్ సహా అన్ని రకాల క్యాన్సర్లు ఆల్కహాల్ సేవనం ద్వారా వస్తాయి. కాబట్టి పరిమితికి మించిన మద్యపానం మంచిది కాదు.

పెదవులకు సన్‌బ్లాక్: సూర్యుడి నుంచి వచ్చే అతినీలలోహిత కిరణాల (యూవీ రేస్) బారినుంచి కాపాడుకునేందుకు పెదవులకు సన్‌బ్లాక్ అప్లయి చేయడం ద్వారా నోటి క్యాన్సర్ ముప్పు తగ్గించుకోవచ్చు.

**హెచ్‌పీవీ నుంచి రక్షణ:** హ్యూమన్ పాపిలోమా వైరస్ (హెచ్‌పీవీ) కూడా నోటి క్యాన్సర్‌కు ఓ కారణం. టీకాలు, ఇతర జాగ్రత్తల ద్వారా హెచ్‌పీవీ బారినపడకుండా చూసుకోవాలి.

**ఆరోగ్యమే మహాభాగ్యం :** క్రమం తప్పకుండా దంతాల పరీక్ష చేయించుకోవాలి. దంత వైద్యులు నోటి క్యాన్సర్ తొలిదశ సంకేతాలను గుర్తించగలుగుతారు. తొలిదశలో గుర్తించడమే చికిత్సలో కీలకం. కాబట్టి, లక్షణాలను గమనించిన వెంటనే వైద్య సహాయం పొందాలి. తరచుగా స్క్రీనింగ్ చేయించుకోవాలి. ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవాటు చేసుకోవాలి. నోటి ఆరోగ్యం గురించి శ్రద్ధ తీసుకోవాలి. పండ్లు, కూరగాయలను భోజనంలో చేర్చుకోవాలి.

## ఆధునాతన పంట విధానాలతో అధిక దిగుబడులు : వ్యవసాయ శాస్త్రవేత్తలు




ఆధునాతన పంట విధానాలతో రైతులు అధిక దిగుబడులు సాధించవచ్చని వ్యవసాయ శాస్త్రవేత్తలు డాక్టర్ ప్రియా, సుధీర్, శ్రీకృష్ణ, దిలీప్ అన్నారు. శనివారం షాబాద్ మండల పరిధిలోని తిమ్మారెడ్డిగూడ గ్రామంలో కృషి విజ్ఞాన కేంద్రం, కేంద్రీయ మెట్ట వ్యవసాయ పరిశోధనా సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో వికసిత కృషి సంకల్ప అభియాన్‌పై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్తలు మాట్లాడుతూ ప్రధానంగా రైతులలో అభివృద్ధి చెందిన వ్యవసాయ సాంకేతికత, స్థిరమైన వ్యవసాయ విధానాల ద్వారా దిగుబడిని, ఆదాయాన్ని పెంచవచ్చని వివరించారు. అధిక దిగుబడి, అధిక లాభం కలిగించే తోటల సాంకేతికతలు, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్, రోబోటిక్స్, కృత్రిమ మేధస్సు, ఆటోమేషన్ వంటి ఆధునిక సాంకేతికత ప్రయోగాలపై రైతులకు వివరించారు. వ్యవసాయం, వనరుల సమర్థ వినియోగం, పంట ఆరోగ్యంపై నిఘా, ఆటోమేటెడ్ నీటి పారుదల వ్యవస్థలు, మెరుగైన వ్యవసాయ విధానాల గురించి నిపుణులు వివరించారు. ఇందులో ముఖ్యంగా రైతుల పొలాల నుంచి మట్టి నమూనాలను శాస్త్రీయంగా సేకరించామన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయశాఖ అధికారి వెంకటేశం, ఏఈవో గీత, ఉద్యానవన శాఖ అధికారి కీర్తికృష్ణ, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

## పాలకూర జ్యూస్‌ను తాగుతున్నారా..? అయితే ఈ జాగ్రత్తలను పాటించాల్సిందే..!



పాలకూర మనకు ఏడాది పొడవునా అన్ని సీజన్లలోనూ అందుబాటులో ఉంటుంది. పాలకూరతో చేసే వంటలను అందరూ ఎంతో ఇష్టంగా తింటారు. దీంతో అనేక కూరలు, ఇతర వంటకాలను చేయవచ్చు. ఆరోగ్యంగా ఉండాలంటే పాలకూరను తరచూ తినాలని పోషకాహార నిపుణులు కూడా చెబుతుంటారు. పాలకూరలో మన శరీరానికి కావల్సిన అనేక పోషకాలు ఉంటాయి. దీన్ని పోషకాలకు నెలవుగా అభివర్ణిస్తుంటారు. పాలకూరను రోజూ తినడం కన్నా జ్యూస్ చేసి తాగితే మేలు అని చాలా మంది బావిస్తుంటారు. ఉదయం పరగడుపునే దీని జ్యూస్‌ను తాగుతుంటారు కూడా. అయితే పాలకూర జ్యూస్‌ను రోజూ తాగే వారు కొన్ని జాగ్రత్తలను తప్పక పాటించాలని, లేకపోతే లాభం కలగకపోగా నష్టం కలుగుతుందని నిపుణులు చెబుతున్నారు. ఇక ఆ జాగ్రత్తలు ఏమిటంటే..

### రోజుకు ఎంత తాగాలి..?

పాలకూర జ్యూస్‌ను రోజుకు 120 నుంచి 240 ఎంఎల్ మోతాదులోనే తాగాలని, అంతకు మించి తాగకూడదని పోషకాహార నిపుణులు హెచ్చరిస్తున్నారు. పాలకూర జ్యూస్‌ను వారంలో 3 లేదా 4 సార్లు తాగితే చాలు, రోజూ తాగాల్సిన పనిలేదని వారు అంటున్నారు. కేవలం పాలకూర జ్యూస్‌ను మాత్రమే కాకుండా దాంతోపాటు ఇతర పండ్లు, కూరగాయలు, ప్రోటీన్లు, ఆరోగ్యకరమైన కొవ్వులు ఉండే ఆహారాలను తీసుకుంటే సమతుల ఆహారం లభిస్తుందని వారు అంటున్నారు. అయితే పాలకూర జ్యూస్‌ను ఎప్పుడూ ఒక పోషక పదార్థంగా భావించాలి తప్ప తినే ఆహారానికి బదులుగా కేవలం ఈ జ్యూస్‌ను మాత్రమే తాగి ఉండకూడదని అంటున్నారు. ఇతర ఆహారాలను కూడా తినాలని వారు సూచిస్తున్నారు.

### విటమిన్ సి అందేలా..

పాలకూర జ్యూస్‌తోపాటు విటమిన్ సి లభించేలా చూసుకోవాలి. దీంతో పాలకూరలో ఉండే ఐరన్‌ను శరీరం ఎక్కువగా శోషించుకుంటుంది. అందుకు గాను పాలకూర జ్యూస్‌లో కొద్దిగా నిమ్మ లేదా నారింజ రసం కలిపి తాగాల్సి ఉంటుంది. దీంతో ఐరన్ సమృద్ధిగా లభించి రక్తం అధికంగా తయారవుతుంది. రక్తహీనత తగ్గుతుంది. ఎర్ర రక్త కణాలు ఆరోగ్యంగా ఉంటాయి. పాలకూర జ్యూస్‌ను నేరుగా తాగితే జీర్ణ వ్యవస్థపై భారం పడే అవకాశం ఉంటుంది. కనుక అందులో కొద్దిగా ఏదైనా ఇతర పండ్ల రసం లేదా నీరు కలిపి తాగితే మంచిది. పాలకూర జ్యూస్‌ను తాగడం కొత్తగా మొదలు పెట్టేవారు ముందు చిన్న మొత్తంలో తాగడం మంచిది. తరువాత ఎక్కువ పరిమాణం పెంచవచ్చు. లేదంటే జీర్ణ వ్యవస్థపై భారం పడే అవకాశం ఉంటుంది.

### వీరు తాగకూడదు..

కిడ్నీ స్టోన్లు ఉన్నవారు లేదా మూత్రాశయం, కిడ్నీ సమస్యలు ఉన్నవారు పాలకూర జ్యూస్‌ను తాగకూడదు, పాలకూరను కూడా తినకూడదు. రక్తాన్ని పలుచగా చేసే మందులను వాడేవారు కూడా ఈ జ్యూస్‌ను తాగకూడదు. కొందరికి ఫుడ్ అలర్జీలు ఉంటాయి. అలాంటి వారు డాక్టర్ సూచన మేరకు పాలకూర జ్యూస్‌ను తాగాల్సి ఉంటుంది. పాలకూర జ్యూస్‌ను తాగడం వల్ల అనేక లాభాలను పొందవచ్చు. దీంతో రోగ నిరోధక శక్తి పెరుగుతుంది, క్యాన్సర్ కణాల పెరుగుదల ఆగిపోతుంది. కళ్లు ఆరోగ్యంగా ఉంటాయి. కంటి చూపు మెరుగు పడుతుంది. బీపీ తగ్గుతుంది. హైబీపీ ఉన్నవారికి ఈ జ్యూస్ ఎంతగానో మేలు చేస్తుంది. రోగ నిరోధక శక్తి పెరుగుతుంది. అధిక బరువు తగ్గుతారు.

## క్యాబేజీ మామిడికాయ పచ్చడి

### కావలసిన పదార్థాలు



**క్యాబేజీ తురుము:** కప్పు
**మామిడి తురుము:** రెండు మూడు టేబుల్ స్పూన్లు
**నూనె:** మూడు టీస్పూన్లు
**ఆవాలు:** టీస్పూను
**ధనియాలు:** టీస్పూను
**మెంతులు:** అర టీస్పూను
ఎండు మిరపకాయలు: రెండు
**ఇంగువ:** చిటికెడు
**పసుపు:** చిటికెడు
**కొత్తిమీర:** నాలుగు రెబ్బలు
**పచ్చిమిరపకాయలు:** రెండు (ఇష్టాన్ని బట్టి)
**ఉప్పు:** తగినంత

### తయారీ విధానం

కాస్త మీడియం సైజు క్యాబేజీ ముక్కను తీసుకుని ఒక కప్పు అయ్యేంత తురిమి పక్కకు పెట్టుకోవాలి. అలాగే పచ్చి మామిడి ముక్కను తీసుకుని రెండు మూడు స్పూన్ల తురుముగా చేసుకొని పక్కకు పెట్టాలి. పొయ్యి మీద బాణలి పెట్టి అందులో ఆవాలు, ధనియాలు, మెంతులు, ఎండు మిరపకాయలు వేసి వేగాక కాస్త ఇంగువ కూడా జోడించి దినుసులన్నిటినీ ఒక ప్లేట్‌లోకి తీసి ఆరబెట్టాలి. తర్వాత అదే నూనెలో ఇందాక పక్కన ఉంచిన క్యాబేజీ, మామిడి తురుమును వేసి, ఉప్పు, పసుపు కూడా జోడించి కాస్త మగ్గనిచ్చి పొయ్యి ఆపేయాలి. ఈ లోపు ఇందాక చేసి పెట్టుకున్న పోపుని మిక్సీలో వేసి కాస్త బరకగా పొడిబట్టి, ఈ తురుములో వేయాలి. కావాలనుకుంటే పచ్చిమిరపకాయ ముక్కలు కూడా కలిపి, చివర్లో తరిగిన కొత్తిమీరను చల్లుకుంటే ఎండకాలపు ప్రత్యేకమైన మామిడి, క్యాబేజీ పచ్చడిని పుల్లపుల్లగా లాగించేయొచ్చు!